కాంగ్రెస్‌లో గ్రూపులు లేవు
అధిష్టానం అందరితో మాట్లాడుతుంది
: మంత్రి శివరాజ్ తంగడిగి
6
కారును ఢీకొన్న లారీ
● దంపతుల దుర్మరణం
● ముగ్గురు పిల్లలకు గాయాలు
● పండగకు వెళ్తుండగా ప్రమాదం

తుంగ..ఉత్సాహంగా..!

● ఎగువన వర్షాలతో జలాశయానికి పోటెత్తుతున్న వరద ● 21 క్రస్ట్‌గేట్ల నుంచి 66వేల క్యూసెక్కుల నీటి విడుదల

బళ్లారి గాంధీనగర్, జూలై 4(ఆంధ్రజ్యోతి): తుంగభద్రకు వరద పోటు కొనసాగుతోంది. జలాశయానికి అధిక ప్రమాణంలో వరద నీరు చేరుతున్న కారణంగా జలాశయం భద్రతా దృష్ట్యా జలాశయం 21 క్రస్ట్‌గేట్ల నుంచి 62,610 వేల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నట్లు బోర్డు అధికారులు తెలిపారు. జలాశయం పై భాగంలో వర్షాలు విస్తారంగా కురుస్తున్నకారణంగా జలాశయానికి అధిక ప్రమాణంలో వరద నీరు చేరుతున్నట్లు అధికారులు తెలిపారు. ప్రస్తుతం జలాశయం ఎత్తు 1624.73అడుగులకు నీరు చేరుకోగా, శుక్రవారం సాయంత్రం 6గంటల సమయానికి 74,555 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది. సాగునీటి కాలువలకు 2707 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నారు. జలాశయం 21 క్రస్ట్‌గేట్ల నుంచి 65,852 క్యూసెక్కుల నీరు విడుదల అవుతున్నట్లు బోర్డు అధికారులు వివరించారు. ఒక్కో క్రస్ట్ గేటు 2.5 అగుడుల చొప్పున పైకి ఎత్తి ప్రతి క్రస్ట్‌గేటు నుంచి 2,820 క్యూసెక్కుల నీరు నదికి విడుదల అవుతోందని బోర్డు అధికారులు తెలిపారు. ప్రస్తుతం జలాశయంలో 76.612 టీఎంసీల నీరు నిలువ ఉంది. గత ఏడాది ఇదే సమయానికి జలాశయంలో కేవలం 10.089 టీఎంసీల నీరు నిల్వ ఉంది. కాల్వలకు నీటి విడుదలతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పలు జిల్లాల్లో సాగుకు సిద్ధం చేసుకున్న నార్లను పొలాలకు తరలిస్తూ సాగుకు సిద్ధం అవుతున్నారు.



జలాశయం నుంచి దిగువకు వస్తున్న నీరు



విధానసౌధలో రైతులతో సమావేశంలో సీఎం సిద్ధరామయ్య, మంత్రులు

భూస్వాధీనం ఆపండి


● సీఎంతో చర్చల్లో రైతుల డిమాండ్ ● పదిరోజులు ప్రక్రియకు బ్రేక్ ● సీద్దరామయ్య హామీ

బెంగళూరు, జూలై 4(ఆంధ్రజ్యోతి): దేవనహళ్లి తాలూకా చన్నరాయపట్టణ హోబళి 13 గ్రామాల్లో 1777 ఎకరాలను కర్ణాటక ఇండస్ట్రియల్ ఏరియా డెవలప్‌మెంట్ బోర్డ్ (కేఐఏడీబీ) చేపట్టిన స్వాధీన ప్రక్రియను వీడాలని రైతులు డిమాండ్ చేశారు. శుక్రవారం విధానసౌధలో దేవనహళ్లి ప్రాంత రైతులతోపాటు ప్రజా, రైతుసంఘాల ప్రతినిధులు సీఎంతో చర్చలు జరిపారు. చన్నరాయపట్టణ హోబళి పరిధిలో దశాబ్దాల కాలంగా పంటలసాగుతో జీవనం సాగిస్తున్నామని ఒక్కసారిగా స్వాధీనం చేసుకుంటే ఉపాధి కోల్పోతామని, పరిహారం కేటాయించినా అది కొంతకాలానికే పరిమితం అవుతుందని ఎట్టి పరిస్థితుల్లోనూ భూములు వదులుకోలేమని రైతులు తేల్చిచెప్పారు. సీఎంతో సభకు వచ్చే ముందు అక్కడి రైతులు పండ్లు, కూరగాయలు తీసుకొచ్చారు. సుదీర్ఘసమయం పాటు చర్చలు జరిపాక ఈనెల 15న మరోసారి సభ జరుపుతామని అప్పటివరకు స్వాధీన ప్రక్రియ ఉండదని సీఎం రైతులకు హామీ ఇచ్చారు. సమావేశంలో మంత్రులు మునియప్ప, భైరేతి సురేశ్, ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బీఆర్ పాటిల్, విలక్షణ నటుడు ప్రకాశ్‌రాజ్, పోరాటనేత నూర్ శ్రీధర్, రైతుసంఘం నాయకుడు బడగలపుర నాగేంద్ర, వరలక్ష్మి, సిద్ధనగౌడపాటిల్, మీనాక్షి సుందరం, దేవనహళ్లి రైతులు రమేశ్ చి మాచేనహళ్లి, కారహళ్లి శ్రీనివాస్, ముకుంద్ చి మాచేనహళ్లి పాల్గొన్నారు.



చర్చల్లో పాల్గొన్న నటుడు ప్రకాశ్ రాజ్

మారని రాతలు..!



● రాష్ట్రంలో ఆగని అన్నదాతల ఆత్మహత్యలు ● ఏడాదిలో 971 మంది బలవన్మరణం ● హావేరి జిల్లాలో అత్యధికం ● అప్పులు.. అధిక వడ్డీలు.. వేధింపులు.. ● పరిహారం చెల్లింపులో ప్రభుత్వ నిర్లక్ష్యం

రాష్ట్ర వ్యాప్తంగా రైతుల ఆత్మహత్యల వివరాలు..

జిల్లా	కేసులు	తిరస్కరణ	పరిహారం	పెండింగ్
హావేరి	129	4	113	12
కలబురగి	82	18	64	-
ధారవాడ	72	20	52	-
మైసూరు	72	12	60	-
బెళగావి	71	13	58	-
హాసన్	46	5	41	-
శివమొగ్గ	45	5	40	-
బీదర్	45	-	45	-
గదగ్	44	17	27	-
యాదగిరి	43	6	37	-
దావణగెరె	42	5	37	-
మండ్య	39	1	38	-

బెంగళూరు, జూలై 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రైతుల రాతలు మారడం లేదు. ప్రభుత్వాలు మారినా వారికి న్యాయం జరగడం లేదు. దేశానికి వెన్నెముక రైతు అంటారు. అన్నదాత పంట పండిస్తేనే ఎవరికైనా ఐదువేళ్లు నోట్లోకెళ్లాయని పాలకులు గొప్పలు చెబుతుంటారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 80 సంవత్సరాలు కావస్తోంది. అయితే వ్యవసాయం చేసేవారికి సాయం కరువు అయ్యింది. వరుణుడు కరుణించాడని పంటలు సాగు చేద్దామని అడుగు ముందుకేసి వ్యవసాయ పనిముట్లు, ఎరువులతోపాటు అన్నింటినీ సమకూర్చుకోవడంలోనే రైతు అప్పులపాలవుతున్నారు. పంట చేతికి అందితే గిట్టుబాటు లేక అయినకాడికి అమ్ముకునే పరిస్థితి వెంటాడుతోంది. ఓవైపు పంటనష్టం మరోవైపు సాంకేతికంగా దిగుబడులకు ధరలు లభించకపోవడంతో వడ్డీ భారమైనా అప్పులకోసం ఎగబడుతున్నారు. తీరా పంటచేతికొచ్చాక నోటికి అందని పరిస్థితి అన్ని పంటల్లోనూ వెంటాడుతున్నాయి. ఇలా చేసిన అప్పులు తీర్చలేమని నలుగురిలో అవమానం పొందాల్సి ఉంటుందని ఆత్మాభిమానాన్ని చంపుకోలేక అన్నదాతలు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. దక్షిణాది రాష్ట్రాలతో ప్రాజెక్టులు, పశ్చిమకనుమలు, మార్కెటింగ్ వ్యవస్థ ఆశాజనకంగా ఉందని చెప్పుకొనే కర్ణాటకలోనే ఏకంగా ఏడాదిలో 971మంది రైతులు బలవన్మరణాలకు పాల్పడ్డారు.

ఏటా వందలాదిమంది రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నా ప్రభుత్వాలు ప్రత్యామ్నాయ మార్గాలు చూపడంలో విఫలం చెందుతున్నారు. మరోవైపు పంట దిగుబడులకు గిట్టుబాటు ధర కల్పించే విషయంలో మీనమేషాలు వేస్తున్నారు. రైతుకు అన్ని విధాలా అండగా ఉంటామని చెప్పుకొనే పాలకులు, అన్నదాత ఆత్మహత్యకు పాల్పడితే వారి కుటుంబ సభ్యులను పరామర్శించేవారు కూడా లేకపోతున్నారు. ఇప్పటికే యువతరం సాగుకు దూరమవుతున్న కాలం వచ్చేసింది. 50 ఏళ్లు దాటినా రైతులు జీవితకాలం కష్టపడి ఉన్నభూములను వదులుకోకుండా సాగుతోనే జీవనం అంటూ ముందుకెళ్తూ అప్పులగొయ్యిలో కూరుకుపోయి ఆత్మహత్యలే శరణ్యంగా భావిస్తున్నారు.

రాష్ట్రంలో 2024 ఏప్రిల్ నుంచి 2025 మార్చి దాకా ఏడాది వ్యవధిలో 971మంది రైతులు ఆత్మహత్యకు పాల్పడ్డారు. అత్యధికంగా హావేరి జిల్లాలోని రైతుల బలవన్మరణాలు సాగాయి. ఆ తర్వాతి స్థానంలో కలబురగి, ధారవాడ ఉన్నాయి. ఉత్తర కర్ణాటక జిల్లాల్లో కృష్ణా నదికి అనుబంధమైన ఆల్మట్టి, నారాయణపుర, హంపిలోని తుంగభద్ర జలాశయం మినహా ఇతరత్రా నీటి వనరులు అంతంత మాత్రంగానే ఉన్నాయి. చెరువులు, కాలువలపైనే ఆధారపడాల్సి వచ్చింది. ఇలా ఉత్తర కర్ణాటక జిల్లాల్లోనే అధికంగా రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు.

ఆత్మహత్యలపై అధ్యయనం జరగాలి

నగరాలు, పట్టణాలలో చిన్నపాటి సమస్య తలెత్తితే వెంటనే కమిటీలు, కమిషన్‌లు వేసి విచారణ జరుపుతారు. కానీ కనీసంగా వెయ్యి కుటుంబాలు వ్యవసాయం కోసం చేస్తున్న అప్పులకు బలవుతున్నారు. వీరికి శాశ్వతమైన భరోసా కల్పించాలంటే సమగ్రమైన అధ్యయనం చేయాల్సి ఉంది. ఏడాది కాలంలో 971మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారంటే ప్రతి నెలా 80మందిదాకా మృతి చెందినట్లే. ఈలెక్కన రోజుకు ఇద్దరికిపైగా రైతులు ఆత్మహత్యకు పాల్పడుతున్నారు. ఏ ప్రాంతంలో ఏ పంట సాగు చేస్తున్నారు? వారు ఆత్మహత్య చేసుకునేందుకు గల కారణాలు ఏమిటనే కోణంలో అధ్యయనం చేస్తే ఎంతోకొంత పరిష్కారం లభించినట్టు అవుతుంది. ప్రభుత్వాలు రైతులపట్ల నిర్లక్ష్యం చేస్తే భవిష్యత్తులో సాగు విస్తీర్ణం మరింత కుశించుకుపోయే ప్రమాదం ఉంది. గత ఏడాది వ్యవసాయ పరపతి సంఘాలు, సహకార బ్యాంకులు గణనీయంగా పంట రుణాలను తగ్గించాయి. కేంద్రం నాబార్డు ద్వారా రుణాల కోటా తగ్గించిందని రాష్ట్రప్రభుత్వం చెబుతోంది. కారణాలు ఏవైనా పంట రుణాలు సకాలంలో అందక ప్రైవేట్ వ్యక్తులు, లోన్ యాప్‌లు, మైక్రో ఫైనాన్స్‌లను ఆశ్రయిస్తున్నారు. అయితే వీటికి సంబంధించి కంతులు, వడ్డీ చెల్లించడంలో జాప్యమైతే వారి సిబ్బంది వేధింపులకు గురిచేసిన సంఘటనలు కోకొల్లలు. మైక్రోఫైనాన్స్, లోన్ యాప్‌ల ద్వారా రుణాలు తీసుకున్నవారు సకాలంలో చెల్లించలేక పల్లెలను వీడి పరారైనవారు ఉన్నారు. మూడు నెలలక్రితం రాష్ట్రంలో ఇదే పెద్ద సమస్యగా కొనసాగింది. ప్రభుత్వం ఇప్పటికే పలు లోన్‌యాప్‌లను రద్దు చేయడంతోపాటు పగటివేళల్లో మాత్రమే రుణాలు వసూలు చేయాలని ఆంక్షలు విధించారు. అయినా మైక్రో ఫైనాన్స్ ఆగడాలు తరచూ వివాదం అవుతూనే ఉన్నాయి.

కాంతేశ్.. శాలినిపై కేసు

ఈశ్వరప్ప కొడుకు, కోడలిపై లోకాయుక్త ఎఫ్ఐఆర్

బెంగళూరు, జూలై 4(ఆంధ్రజ్యోతి): అక్రమాస్తుల ఆరోపణలకు సంబంధించి మాజీ డీసీఎం కేఎస్ ఈశ్వరప్ప, కుమారుడు కాంతేశ్, కోడలి శాలినిపై అవినీతి వ్యతిరేకచట్టం కింద శివమొగ్గ లోకాయుక్త పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. ప్రజాప్రతినిధుల ప్రత్యేక న్యాయస్థానం ఆదేశాల మేరకు కేసు నమోదైంది. ఈశ్వరప్పతోపాటు కుటుంబ సభ్యులపై వినోద్ అనే వ్యక్తి ప్రైవేట్ కేసు నమోదు చేశారు. ఈమేరకు కోర్టు ఆదేశాలతో లోకాయుక్త పోలీసులు కేసు నమోదు చేసి విచారణకు హాజరు కావాలని నోటీసులు జారీ చేశారు. ఈశ్వరప్ప 2012లో జలవనరులశాఖ మంత్రిగా ఉన్నప్పుడు ఆదాయానికి మించి ఆస్తులు ఉన్నాయనే ఆరోపణలు ఉన్నాయి. ఇందుకు సంబంధించి లోకాయుక్త కోర్టులో వినోద్ పిటిషన్ దాఖలు చేయగా కొట్టివేశారు. ఈమేరకు వినోద్ లోకాయుక్త కొట్టివేసిన కేసుపై హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. హైకోర్టు పరిగణనలోకి తీసుకుని విచారణ జరపాలని లోకాయుక్త పోలీసులను ఆదేశించింది. దీంతో శివమొగ్గ పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు.

విద్యార్థినికి వేధింపులు

● సిమ్స్ డాక్టర్‌పై సస్పెన్షన్ వేటు



బెంగళూరు, జూలై 4(ఆంధ్రజ్యోతి): విద్యార్థినిపై లైంగిక వేధింపులకు పాల్పడిన వివాదంలో జనరల్ సర్జరీ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ అశ్విన్ హెబ్బార్‌ను సస్పెండ్ చేస్తూ ప్రభుత్వం శుక్రవారం ఆదేశాలు జారీ చేసింది. శివమొగ్గలోని మెడికల్ కళాశాల విద్యార్థినిని లైంగికంగా వేధించిన ఆరోపణలు ఉన్నాయి. బాధిత విద్యార్థిని శివమొగ్గ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎఫ్ఐఆర్ నమోదు కాగా అసిస్టెంట్ ప్రొఫెసర్ పరారీలో ఉన్నారు. దీంతో విద్యార్థులు కళాశాలలో ఆందోళనకు దిగారు. శివమొగ్గ పోలీసులు తెలిపిన మేరకు జూన్ 14న హోటల్‌లో పార్టీకి వెళ్లినప్పుడు పీజీ విద్యార్థిని పట్ల అనుచితంగా ప్రవర్తించారు. జూన్ 26న మహిళా పోలీసులు అశ్విన్‌ను బెంగళూరులో అదుపులోకి తీసుకున్నారు. జూలై 4వరకు జ్యుడీషియల్ కస్టడీకి ఆదేశించారు. అయితే రెండు రోజుల్లోనే బెయిల్‌పై బయటకు వచ్చారు. కానీ వైద్యవిద్యాశాఖ సమగ్ర విచారణ జరిపి ప్రభుత్వ సేవలనుంచి సస్పెండ్ చేశారు. ఈమేరకు శివమొగ్గ మెడికల్ కళాశాల పాలకపరిషత్ ఉపాధ్యక్షులు మహ్మద్ మొహిసిన్ శుక్రవారం ఆదేశాలు జారీ చేశారు.

ప్రవీణ్ నెట్టారు హత్య కేసులో .. నిందితుడి అరెస్టు

బెంగళూరు, జూలై 4(ఆంధ్రజ్యోతి): బీజేపీ యువమోర్చా సభ్యుడు ప్రవీణ్ నెట్టారు హత్యకేసులో నిందితుడిని ఎన్ఐఏ అధికారులు శుక్రవారం అరెస్టు చేశారు. సుమారు రెండేళ్లుగా నిందితుడు తలదాచుకున్నాడు. మంగళూరు కణ్ణూరు అంతర్జాతీయ విమానాశ్రయంలో ఖత్తార్ నుంచి వచ్చిన అబ్దుల్ రెహమాన్‌ను ఎన్ఐఏ అధికారులు వెంటనే అదుపులోకి తీసుకున్నారు. ప్రవీణ్‌నెట్టారు హత్య కేసులో ఇంతవరకు ఎన్ఐఏ 21మంది నిందితులను అరెస్టు చేయగా తాజాగా కీలక నిందితుడు అబ్దుల్ రెహమాన్‌ను అరెస్టు చేశారు. 2022 జూలై 26న దక్షిణకన్నడ జిల్లాలో నిషేధిత సంఘం పాపులర్ ఫ్రంట్ ఆఫ్ ఇండియా (పీఎఫ్ఐ) సభ్యుడు ప్రవీణ్ నెట్టారును హతమార్చిన విషయం తెలిసిందే. అప్పటి నుంచి తలదాచుకున్న ప్రధాన నిందితుడు అబ్దుల్‌రెహమాన్ ఆచూకీ తెలిపినవారికి రూ.4లక్షల రివార్డు ప్రకటించారు. ఈ కేసులో మొత్తం 28 నిందితులపై చార్జ్‌షీట్ దాఖలు చేశారు.

కాంగ్రెస్‌తోనే కార్మికుల సంక్షేమం

● మంత్రి సంతోష్ లాడ్ ● శ్రామికులకు స్మార్ట్ కార్డుల పంపిణీ

బళ్లారి, జూలై 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అసంఘటిక కార్మికుల క్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి సంతోష్ లాడ్ అన్నారు. శుక్రవారం విజయనగర జిల్లాలో అసంఘటిత కార్మికులకు స్మార్ట్ కార్డుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో 35 లక్షల అసంఘటిత కార్మికులను గుర్తించి స్మార్ట్ కార్డులు అందజేస్తున్నామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 26 వర్గాల అసంఘటిక కార్మికులను నమోదు చేశామన్నారు. కొత్తగా వెనుకబడిన తరగతులకు చెందిన సంప్రదాయ వృత్తుల్లో ఉన్న 38 వర్గాల కార్మికులు చేర్చామన్నారు. ప్రమాదంలో మరణించిన అసంఘటిత కార్మికులకు రూ. 5 లక్షలు, వైకల్యం చెందిన వారికి రూ. 2 లక్షలు, ఈ పథకం ద్వారా చెల్లిస్తారన్నారు. ఇలా అనేక సౌకర్యాలు అసంఘటిక క్షేమం నిధి నుంచి ప్రభుత్వం అందిస్తుందన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సీఎం సిద్దరామయ్య అనేక పథకాలను ప్రజలకోసం ప్రారంభించారన్నారు. ఎంపీ తుకారాం, ఎమ్మెల్యే గవియప్ప మాట్లాడుతూ కాంగ్రెస్ పేదలకు అనేక సంక్షేమ పథకాలు అందిస్తోందన్నారు. కూడ్లిగి ఎమ్మెల్యే ఎన్.టీ శ్రీనివాస్, పురపాలక సంఘం అధ్యక్షుడు రూపేష్ కుమార్, డీసీ ఎం.ఎస్ దివాకర్, జెడ్పీ సీఈవో నొంగ్‌జోయ్‌మద్ లేబర్ కమిషనర్ గోపాలకృష్ణ పాల్గొన్నారు.



స్మార్ట్ కార్డు అందజేస్తున్న మంత్రి సంతోష్ లాడ్

కసాప అక్రమాలపై విచారణకు ఆదేశం

బెంగళూరు, జూలై 4(ఆంధ్రజ్యోతి): కన్నడ సాహిత్య పరిషత్‌లో భాషా పనులకోసం కేటాయించిన గ్రాంట్లలో అక్రమాలు జరిగాయనే ఆరోపణలతో ప్రభుత్వం విచారణకు ఆదేశించింది. 45రోజుల్లో నివేదిక సమర్పించాలని జిల్లా సబ్‌రిజిస్ట్రార్‌ను ఆదేశించారు. ఈమేరకు సహకారసంఘాల అధికారి పీ శశిధర్‌ను విచారణాధికారిగా నియమించారు. 2022-23 నుంచి ఇప్పటివరకు ఆమోదించిన సవరణలను పరిశీలించడం, ప్రస్తుత అధ్యక్షులు నిబంధనలు ఉల్లంఘించి ఉంటే జిల్లా పదాధికారులకు నోటీసులు జారీ చేయడం వంటి అంశాలతోపాటు మరిన్ని అంశాలు ఉన్నట్టు తెలుస్తోంది. కసాప అధ్యక్షుడు మహేశ్‌జోషిపై ఉన్న ఆరోపణలలో సాహిత్య పరిషత్ బైలాను సవరణ చేయడం, సంఘం నుంచి వాహనం కొనుగోలు చేసి విక్రయించడం, భవనం ఆధునీకరణలో అక్రమాలు, హావేరి, మండ్యలో జరిగిన అఖిలభారత కన్నడ సాహిత్య సమ్మేళనంలలో ఆడిట్ చేయించకపోవడం, సంఘం నిధులను కుటుంబ సభ్యుల కార్యక్రమాలకు వినియోగించడం, గుర్తింపుకార్డులతో అక్రమాలు వంటి అంశాలు, సీఎస్ఆర్ గ్రాంట్ల దుర్వినియోగం వంటి అంశాలు ఉన్నాయి. మరోవైపు ఇటీవలే గౌరవ కార్యదర్శి పదవికి రాజీనామా చేసిన నేభ రామలింగశెట్టి పలు ఆరోపణలు చేశారు. రామలింగశెట్టి తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని అధ్యక్షుడు మహేశ్ జోషి అభిప్రాయపడ్డారు. శుక్రవారం బెంగళూరులో మీడియాతో మాట్లాడుతూ రామలింగశెట్టి ఆరోపణలు వాస్తవానికి దూరమని, సరైన సమయంలో వివరణ ఇస్తానన్నారు. అతడిని తొలగించాలని భావించామని ఈలోగానే అతడు రాజీనామా చేశారన్నారు.

చాముండి కొండ కిటకిట

● ఆషాఢ శుక్రవారం సందర్భంగా భక్తుల ప్రత్యేక పూజలు
● బనశంకరి అమ్మవారికి ఫలాలతో ప్రత్యేక అలంకరణ



బనశంకరి అమ్మవారికి హారతి ఇస్తున్న అర్చకులు



చాముండేశ్వరి అమ్మవారిని దర్శించుకున్న డీసీఎం దంపతులు


బెంగళూరు, జూలై 4 (ఆంధ్రజ్యోతి): ఆషాఢమాసం రెండో శుక్రవారం భక్తజనంతో చాముండేశ్వరి కొండలు కిటకిటలాడాయి. మైసూరుతోపాటు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలు, పొరుగు రాష్ట్రాలనుంచి భక్తులు తరలివచ్చారు. శుక్రవారం తెల్లవారుజామునుంచే అమ్మవారి దర్శనం చేసుకున్నారు. డీసీఎం డీకే శివకుమార్ దంపతులు దర్శనం చేసుకున్నారు. నటుడు దర్శన్ కుటుంబ సభ్యులతో దర్శనం చేసుకున్నారు.

బనశంకరి మాతకు దీపార్చన

ఆషాఢశుక్రవారంలో భాగంగా బనశంకరి మాతకు భక్తులు దీపార్చన చేశారు. తెల్లవారుజామున 5 గంటలనుంచే భక్తుల సందడి ప్రారంభం అయ్యింది. మహిళలు నిమ్మకాయలతో జ్యోతులు వెలిగించి అమ్మవారికి సమర్పిస్తారు. వేలాదిమంది భక్తులు తరలిరావడంతో ఆలయప్రాంగణం కిటకిటలాడింది. అమ్మవారిని వివిధ రకాల పండ్లతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. భక్తులు విశేషంగా తరలివచ్చారు.



నిమ్మకాయ దీపాలతో భక్తులు



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1624.84	1,588.84
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	27, 441	15.492
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	54,938	273
నీటి నిల్వ (టీఎంసీలు)	75.84	10.09



ప్రమాద స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ శ్రీహరిబాబు

కారును ఢీకొన్న లారీ

దంపతుల దుర్మరణం, పిల్లలకు గాయాలు

బళ్లారి సిటీ,జూలై 4(ఆంధ్రజ్యోతి):విజయనగరం జిల్లా పట్టణ శివారులో జరిగిన ప్రమాదంలో దంపతులు దుర్మరణం చెందారు. గురువారం కేపీటీసీఎల్ కార్యాలయం ముందు జాతీయ రహదారి 50పై ఈ ప్రమాదం జరిగింది. బెంగళూరులో క్యాబ్‌డ్రైవర్‌గా పనిచేస్తున్న ముత్తప్ప పూజార్(35), భార్య రేణుక(30) మృతి చెందారు. మోహర్రం పండుగ కొరకు తమ స్వగ్రామమైన బాగల్‌కోట్ జిల్లాలోని చట్నీహాల్ గ్రామానికి వెళ్తుండగా ప్రమాదం జరిగింది. వారి పిల్లలు అనుశ్రీ, రూపశ్రీ, రుషి తీవ్రంగా గాయపడ్డారు. వారిని కొప్పళ ఆసుపత్రి నుంచి హుబ్బళ్లి ఆసుపత్రికి తరలించి తదుపరి చికిత్స అందిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ప్రమాదం జరిగిన చోటు నుంచి లారీ కారును అర కిలోమీటర్‌కు పైగా లాక్కుపోయింది. దీంతో కారు పూర్తిగా నుజ్జునుజ్జయింది. శుక్రవారం ఉదయం ఘటనా స్థలానికి ఎస్పీ శ్రీహరి బాబు సందర్శించి పరిశీలించారు.

ఉత్సాహంగా హాకీ పోటీలు

బళ్లారి సిటీ, జూలై 4(ఆంధ్రజ్యోతి): నగరంలోని జిల్లా హాకీ స్టేడియంలో జరుగుతున్న ఐదు రోజుల సబ్-జూనియర్ పురుషుల రాష్ట్రస్థాయి హాకీ టోర్నమెంట్‌లో రెండవ రోజు గదగ్, శివమొగ్గ లీగ్ మ్యాచ్‌లో శుక్రవారం మ్యాచ్ డ్రాగా ముగిసింది. గురువారం కొడగు చేతిలో ఒక్క గోల్ తేడాతో ఓడిపోయిన శివమొగ్గ శుక్రవారం డ్రాగా ముగిసింది. బళ్లారి అసోసియేషన్ ,స్టేట్ అండ్ హాకీ అసోసియేషన్ ఆఫ్ ఇండియా సహకారంతో పోటీలను నిర్వహిస్తున్నారు.

పనులలో నాణ్యత పాటించాలి

● ఎమ్మెల్యే నారా భరత్ రెడ్డి



బళ్లారి సిటీ,జూలై 4(ఆంధ్రజ్యోతి): నగరంలో జరుగుతున్న పనులు త్వరగా, నాణ్యతగా పూర్తి చేయాలని నగర ఎమ్మెల్యే నారాభరత్‌రెడ్డి కాంట్రాక్టర్లకు సూచించారు. శుక్రవారం నగరంలో పర్యటించిన ఎమ్మెల్యే పలు అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పనులు నాణ్యతగా జరగుతున్నాయని, ప్రతిపక్షాలు అసత్య ప్రచారాలు చేస్తున్నాయన్నారు. అనుకున్న సమయంలోనే అన్ని ప్రణాళిక ప్రకారం జరుగుతున్నాయన్నారు. సుదాక్రాస్ వద్ద రైల్వే వంతెన పనులు నిలిచిపోయాయని, ఈ ప్రాంత ప్రజలు కోర్టును ఆశ్రయించడంతో ఆలస్యమవుతున్నాయన్నారు. వివరాల కోసం నియోజకవర్గ ఎమ్మెల్యే నాగేంద్రను అడగాలన్నారు. సీఎం, డీసీఎంలపై మాట్లాడే స్థాయికి ఎదగలేదన,ఇ తాను మంత్రి పదవిని ఆశించేవాడిని కాదన్నారు.

కాంగ్రెస్‌లో గ్రూపులు లేవు: మంత్రి శివరాజ్



విలేకరులతో మాట్లాడుతున్న మంత్రి శివరాజ్ తంగడిగి

బళ్లారి, జూలై 4(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ అధినాయకులు సుర్జేవాలా, కల్యాణ కర్ణాటక, ఉత్తర కర్ణాటక పార్టీ ఇన్‌చార్జులు కలిసి ఉత్తర కర్ణాటక జిల్లాల ఎమ్మెల్యేలతో సోమవారం చర్చిస్తారని రాష్ట్ర మంత్రి శివరాజ్ తంగడిగి అన్నారు. శుక్రవారం బళ్లారిలోని ప్రభుత్వ అతిథి గృహంలో ఎమ్మెల్యే నారా భరత్‌రెడ్డి, బళ్లారి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అల్లం ప్రశాంత్‌లతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. అందరి ఎమ్మెల్యేలతో అధిష్ఠాన పెద్దలు సుర్జేవాల, కల్యాణకర్ణాటక, ఉత్తర కర్ణాటక జిల్లాల పార్టీ ఇన్‌చార్జిలు ఎమ్మెల్యేలతో చర్చిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే రాష్ట్రంలో ఉన్న ఎమ్మెల్యేలు, మంత్రులతో మాట్లాడుతున్నామన్నారు. రెండేళ్లలో పార్టీ అధికారంలో వచ్చాక ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చామా..? ప్రజలు పార్టీ పట్ల ఎలా ఉన్నారు.? ఇంకా ఏమైనా హామీలు ఇవ్వాలా..? అనే అంశం పై ఎమ్మెల్యేలతో విడివిడిగా చర్చిస్తున్నామన్నారు. సీఎం మార్పు అనేది అసత్య ప్రచారాలేనన్నారు. తుంగభద్ర జలాశయం నుంచి నీరు విడుదల చేశామని, రైతులు నీరును సక్రమంగా వినియోగించుకోవాలన్నారు.

పాలతో సంపూర్ణ ఆరోగ్యం

‘రబకోవి’ మిల్క్ ఫెడరేషన్ డైరెక్టర్ ప్రభుశంకర్




మాట్లాడుతున్న ప్రభుశంకర్

బళ్లారి సిటీ, జూలై 4(ఆంధ్రజ్యోతి): పాలు మానవ జీవితంలో కీలక పాత్ర పోషిస్తాయని, పాలలో పొటాషియం, ప్రోటీన్ , విటమిన్ బీ2 వంటి పోషకాలు పుష్కలంగా ఉండి, మానవ ఆరోగ్యానికి మేలు చేస్తాయని రాయచూర్, బళ్లారి , కొప్పళ, విజయనగరం (రబకోవి) మిల్క్ ఫెడరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ ప్రభుశంకర్ అన్నారు. శుక్రవారం నగరంలోని నంది స్కూల్ ఆడిటోరియంలో నిర్వహించిన నందిని పాలు , పాల ఉత్పత్తుల అవగాహన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. నందిని పాలు ,పాల ఉత్పత్తులు సమతుల్య ఆరోగ్యానికి అవసరమైన ముఖ్యమైన పోషకాలను కలిగి ఉంటాయి. ఆరోగ్యానికి మంచివి. పాలు పాల ఉత్పత్తుల గురించి అవగాహన కల్పించడమే ఈ అవగాహన కార్యక్రమం యొక్క ప్రధాన లక్ష్యం అని అన్నారు. ఈకార్యక్రమంలో రబకొవి మిల్క్ ఫెడరేషన్ మేనేజర్ మోహన్ షిండే మాట్లాడుతూ పాడి పరిశ్రమలకు సంబందించిన ఏవైనా సాధ్యమైన కార్యక్రమాలకు మద్దతు ఇవ్వడానికి అవకాశాలను కల్పిస్తామని అన్నారు. ఈసందర్భంగా నంది స్కూల్ డైరెక్టర్ ఉమేరా అహ్మద్, స్కూల్ ప్రిన్సిపాల్ జబీన్, మునీర్‌షేక్, పాల డిప్యూటీ మేనేజర్ సిద్దరామప్ప శివరాయ, అసిస్టెంట్ మేనేజర్ ఎర్రిస్వామిరెడ్డి, మల్లికార్జున, నాగరాజ్‌శర్మ, సూపర్‌వైజర్లు లోహిత్ కుమార్, ప్రసన్నకుమార్, మంజునాథ్, బాబు, విద్యార్థులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహ కళ్లద్దాలు ధ్వంసం

● సిరవారలో ఉద్రిక్తత ● దళిత సంఘాల ఆందోళన

రాయచూరు, జూలై 4 (ఆంధ్రజ్యోతి) : భారత రత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి ఉన్న అద్దాలను తొలగించి విగ్రహాన్ని అవమానం చేయడం జిల్లాలోని సిరవార తాలూకా హరవి గ్రామంలో ఉద్రిక్తతకు దారి తీసింది. గురువారం రాత్రి కొంత మంది గుర్తు తెలియని దుండగులు విగ్రహానికి ఉన్న కళ్లద్దాలను తొలగించి విగ్రహాన్ని ధ్వంసం చేసి అవమానం పరిచినట్లు గుర్తించిన స్థానికులు ఉదయాన్నే ఒక్క సారిగా విగ్రహం వద్దకు వచ్చి ఆందోళనకు దిగారు. గ్రామానికి చెందిన బసప్పప్ప అనే వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదు మేరకు సిరవార సర్కిల్ ఇన్‌స్పెక్టర్, తహసీల్దార్, ఎస్.ఐలు సంఘటన స్థలాన్ని పరిశీలించి అక్కడి పరిస్థితిని సమీక్షించారు. ఈ సందర్భంగా అక్కడికి చేరుకున్న పలు దళిత సంఘాలు, ప్రజా సంఘాల నాయకులు, కార్యకర్తలు బాధ్యులైన దుండగులను వెంటనే గుర్తించి చట్టపరంగా శిక్షించాలని డిమాండ్ చేస్తు ధర్నాకు దిగారు. ఈ సందర్భంగా గ్రామంలో ఎలాంటి ఉద్రిక్తతలు తలెత్తకుండా పోలీసులు అందరిని శాంత పరిచే ప్రయత్నం చేశారు. నిందితులను గుర్తించి చర్యలు తీసుకుంటామని పోలీసులు హామి ఇవ్వడంతో పరిస్థితి చక్కపడింది.



ధ్వంసమైన కంటి అద్దాలు

విద్యార్థిపై స్కూల్ బస్ డ్రైవర్ దాడి

పాఠశాలకు డీడీపీఐ నోటీసు జారీ

రాయచూరు, జూలై 4 (ఆంధ్రజ్యోతి) : రెండవ తరగతి చదువుతున్న బాలుడి పై ప్రైవేటు పాఠశాలకు చెందిన బస్ డ్రైవర్ దాడి చేయడం జిల్లాలో చర్చనీయాంశంగా మారింది. నాలుగు రోజుల క్రితం జరిగిన ఈ సంఘటన ఆలస్యంగా వెలుగు చూడగా స్పందించిన డీడీపీఐ బాధిత కుటుంబాన్ని పరమార్శించడంతో పాటు పాఠశాలకు డ్రైవర్ పై కఠిన చర్యలు తీసుకోవాలంటూ నోటీసు జారీ చేశారు. సింధనూరు తాలూకాలోని గుడదిన్ని క్యాంప్‌లో ఉన్న ఒక ప్రైవేటు పాఠశాలలో సమీప గ్రామానికి చెందిన బాలుడు నిత్యం బస్సులో వెళ్లి వస్తున్నాడు. సోమవారం బాలుడి పై డ్రైవర్ అకారణంగా చేయి చేసుకోవడంతో వీపు పై వాతలు రావడాన్ని గమనించిన తల్లిదండ్రులు బాలుడిని విచారించగా విషయం బయటికి పొక్కింది. తల్లిదండ్రులు డ్రైవర్ పై ఫిర్యాదు చేశారు. విషయం తెలుసుకున్న విద్యాశాఖ అధికారులు వెంటనే స్పందించి అటు బాలుడి తల్లిదండ్రులతోను మాట్లాడిన పాఠశాల యాజమాన్యానికి నోటీసు జారీ చేశారు. ఈ విషయం పై తుర్విహాళ్ సబ్ ఇన్‌స్పెక్టర్ సుజాతా సంఘటన స్థలాన్ని సందర్శించి వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా శుక్రవారం విలేకరులతో మాట్లాడిన ఆమె తల్లిదండ్రుల నుంచి లిఖితపూర్వక ఫిర్యాదు వస్తే డ్రైవర్ పై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

కృష్ణాలో పెరిగిన ప్రవాహం



నారాయణపూర్ డ్యామ్ నుంచి దిగువకు వస్తున్న నీరు

రాయచూరు, జూలై 4 (ఆంధ్రజ్యోతి) : ఎగువ భాగంలో కురుస్తున్న వర్షాల వల్ల జిల్లా సరిహద్దులను ఆనుకుని ప్రవహిస్తున్న రెండు నదులు కృష్ణ-తుంగభద్రల్లో వరద ప్రవాహం శుక్రవారం భారీ స్థాయిలో పెరిగింది. తుంగభద్ర జలాశయం వద్ద ఇన్‌ఫ్లో 1 లక్ష క్యూసెక్కులుండగా దాదాపు 50 వేల క్యూసెక్కులకు పైగా నీటిని దిగువకు విడుదల చేస్తుండడంతో సింధనూరు, లింగసుగూరు, రాయచూరు తాలూకాలోని నది తీర గ్రామాల ప్రజలకు జిల్లా యంత్రాంగం హెచ్చరికలు జారీ చేసింది. అదే సమయంలో నారాయణపూర్ డ్యాంకు 1 లక్ష 10వేల క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతుండగా దిగువకు 95 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తుండడంతో కృష్ణనది ప్రవాహం గణనీయంగా పెరిగింది. ఈ క్రమంలో నది తీర గ్రామాలు ఉన్న దేవదుర్గ, లింగసుగూరు, రాయచూరు తాలూకా యంత్రాంగాలను జిల్లా యంత్రాంగం అప్రమత్తం చేసింది. ముందు జాగ్రత చర్యలతో పాటు ప్రజలెవ్వరు నది తీరాలకు వెళ్లకుండా కట్టడి చేయాలని జిల్లా అధికారి ఆదేశించారు.

ఏడాదిగా జీతాలు లేక ఔట్‌సోర్సింగ్ సిబ్బంది విలవిల

రాయచూరు, జూలై 4(ఆంధ్రజ్యోతి) : జిల్లా వైద్య ఆరోగ్య శాఖలో ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో పని చేస్తున్న 300 మంది కార్మికులకు గత ఏడాది కాలంగా వేతనాలు అందకపోవడం సర్వత్ర చర్చనీయంశమైంది. గతంలో కార్మికులను కాంట్రాక్ట్ పద్ధతితో కుదుర్చుకున్న కంపెనీ ఒకటి నాల్గు మాసాల పాటు వేతనాలు ఇవ్వకుండా ఇక్కడి నుంచి వెళ్లిపోగా ఆ బాధ్యతలు స్వీకరించిన మరో కంపెనీ యాజమాన్యం సహితం 8 నెలలుగా వేతనాలు ఇవ్వకుండా వెట్టి చాకిరి చేస్తున్నారని కార్మికులు ఆరోపిస్తున్నారు. ఈ విషయంలో తమ పరిధిలో కార్మికులు వేతనాలు లేకా ఏడాది కాలంగా అలమటిస్తున్నా జిల్లా వైద్య ఆరోగ్య శాఖకు చెందిన ఉన్నతాధికారులు స్పందించడం లేదని కార్మికులు ఆరోపిస్తున్నారు. దీంతో పాటు ఇటు నగరంలోను అటు గ్రామీణ ప్రాంతాల్లోను ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిస్థితి దుర్భరంగా మారుతున్నా అధికారుల్లో స్పందన లేకపోవడం గమనార్హం. ఈ విషయంలో జడ్పీ సీఈఓ జోక్యం చేసుకోవాలని కాకర్మికులు కోరుకుంటున్నారు. అదే సమయంలో జిల్లాధికారి వైద్య ఆరోగ్య శాఖ పని తీరు పై వెంటనే సమీక్ష నిర్వహించి తమకు న్యాయం చేయాలని కార్మికులు కోరుతున్నారు.



డీహెచ్‌ఓ కార్యాలయం

నేటి నుంచి పది సప్లిమెంటరీ పరీక్షలు

● పరీక్ష కేంద్రాల చుట్టూ నిషేధాజ్ఞలు : కలెక్టర్ మిశ్రా



బళ్లారి సిటీ, జూలై 4(ఆంధ్రజ్యోతి): పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలు-3 శనివారం నుంచి ప్రారంభం కానున్నాయి. కర్ణాటక స్కూల్ ఎగ్జామినేషన్ అండ్ ఎవాల్యుయేషన్ బోర్డు నిర్వహిస్తున్న ఈ పరీక్షలు 15పరీక్షా కేంద్రాల్లో నిర్వహిరచనున్నట్లు జిల్లాకలెక్టర్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్షా కేంద్రాల చుట్టూ 200మీటర్ల వరకు నిషేధిత ప్రాంతంగా ప్రకటించాలని ఆదేశించారు. పరీక్షా కేంద్రాలకు 200మీటర్ల పరిధిలో ఉన్న జిరాక్స్ సెంటర్లు, ఇంటర్నెట్ సెంటర్లను మూసేయాలన్నారు. అనధికార వ్యక్తులు ,వ్యక్తుల సమూహాలు ఈ ప్రాంతంలోకి ప్రవేశించరాదన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవన్నారు.

శాంతినగర్‌లో ఇంటింటి సర్వే



వైద్యులతో చర్చిస్తున్న డీహెచ్‌ఓ యల్ల రమేష్‌బాబు

కంప్లి, జూలై 4(ఆంధ్రజ్యోతి) : తాలుకా పరిధిలోని శాంతినగర్‌లో వైద్య సిబ్బంది, డెంగీ, మలేరియా నివారణపై శుక్రవారం సర్వే చేపట్టారు. గత కొన్ని రోజులుగా శాంతినగర్‌లో ప్రజలు జ్వరాలతో అల్లాడిపోయారు. డీహెచ్‌ఓ రమేష్‌బాబు ఇంటింటికీ పర్యటించి సమస్యలపై ఆరా తీశారు. క్యాంపులో తాత్కాలిక ఆరోగ్య కేంద్రం ఏర్పాటు చేయాలని వైద్యులకు సూచించారు. అవసరమైన వారికి రక్త పరీక్షలు చేయాలన్నారు. గ్రామ పంచాయతీ సభ్యులు ప్రభాకర్ మాట్లాడుతూ మురికి కాల్వలు, ట్యాంకుల్లో పరిశుభ్రతా చర్యలు చేపడుతున్నామన్నారు. ప్రతి ఇంటి చుట్టూ బ్లీచింగ్ పౌడర్ చల్లి రోగాలు భారిన పడకుండా జాగ్రత్తలు వహిస్తున్నామన్నారు. వారితో పాటు వైద్యులు అబ్దుల్, రవీంద్ర, మరిఎంటీ మహమ్మద్ ఫరూక్, శేషగిరి ఈశ్వర్ బసవరాజు, పూజ, బసవన్న గౌడ, రామచంద్ర క్యాంపు వాసులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఆరోగ్యం



క్రీడాకారులతో ఎమ్మెల్యే గాలి జనార్దన్‌రెడ్డి సతీమణి లక్ష్మీఅరుణ

బళ్లారిరూరల్, జూలై4(ఆంధ్రజ్యోతి): క్రీడలతోనే మానసిక ఆరోగ్యం సాధ్యమని గంగావతి ఎమ్మెల్యే గాలి జనార్దన్‌రెడ్డి సతీమణి గాలి లక్ష్మీ అరుణ అన్నారు. శుక్రవారం నగరంలో ఫొటోగ్రాఫర్ అసోసియేషన్ నిర్వహించిన 11వ వార్షిక టోర్నమెంట్ క్రీడల్లో పాల్గొన్న అరుణ క్రీడల ప్రాధాన్యాన్ని వారికి వివరించారు. ఈ కార్యక్రమంలో ఫొటోగ్రాఫర్ల అధ్యక్షులు చంద్రమోహన్, దాన డైరెక్టర్ వీరేష్, మున్సిపల్ కార్పొరేషన్ సభ్యులు మోత్కూరు శ్రీనివాస్, మాజీమేయర్ అధ్యక్షులు దమ్మూరు శేఖర్, శ్రీనివాస్ మోత్కూరు, రవీంద్రారెడ్డి, రాఘవేంద్ర, సుభాన్, వీరేష్, ఖాదర్, షేక్ బాషాతో పాటు పొలం క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

తాయమ్మదేవికి ప్రత్యేక పూజలు

సిరుగుప్ప, జూలై4(ఆంధ్రజ్యోతి) :ఆషాఢ శుక్రవారం సందర్భంగా తాయమ్మదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సిరుగుప్ప పట్టణం ఆదోని రోడ్డుమార్గంలో వెలసిన తాయమ్మదేవికి అర్చకులు ప్రవీణ్, శ్రీనివాస్‌లు అమ్మవారికి పుష్పాలంకరణ, తమలపాకులపూజ, కుంకుమార్చన సేవలు నిర్వహించారు. మహామంగళహారతి చేపట్టారు. భక్తులు దర్శనం కోసం బారులు తీరారు. ఆలయ కమిటీ సభ్యులు ప్రసాద పంపిణీ చేశారు.



ఘనంగా పీర్ల ఊరేగింపు



ఊరేగింపులో పాల్గొన్న ఎమ్మెల్యే బీఎం నాగరాజు

సిరుగుప్ప, జూలై 4(ఆంధ్రజ్యోతి): పీర్లదేవుళ్ల పండుగ పురస్కరించుకుని తాలుకాలోని అగసనూరు గ్రామంలో చారిత్రాత్మకంగా ప్రసిద్ధి చెందిన పీర్ల దేవుళ్లను గ్రామ పురవీధుల్లో ఊరేగించారు. సిరుగుప్ప తాలుకా వ్యాప్తంగా అన్ని చోట్ల పీర్లదేవుళ్ల స్థాపన జరిగింది. గత శుక్రవారం నుంచి నేటి వరకు మూడు రోజుల పాటు పీర్ల దేవుళ్లకు వివిధ ధార్మిక కార్యక్రమాలు చేపట్టారు. ఈ కార్యక్రమం పంచాయతీ మాజీ అధ్యక్షులు గోపాల్‌రెడ్డి, కరిబసప్ప, మారుతీ వరప్రసాద్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు, భక్తులు పాల్గొన్నారు.

ఇంటి పట్టాల పంపిణీ

కంప్లి, జూలై 4(ఆంధ్రజ్యోతి): కంప్లి తాలుకా ఎమ్మిగనూరు గ్రామ పంచాయతీ పరిధిలోని శ్రీరామచంద్రాపురం క్యాంపులో శుక్రవారం ఎమ్మెల్యే గణేష్ 133 పేద కుటుంబాలకు ఇంటి పట్టాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయనమాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల వేళ ఇచ్చిన మాట నిలబెట్టుకుంటుందన్నారు. కంప్లి నియోజకవర్గంలో కంప్లి, కురుగోడు రెండు తాలుకాల్లో అభివృద్ధి పనులు విస్తృతంగా చేపడుతున్నామన్నారు. బీజేపీ హయాంలో చేయలేని పనులన్నీ కాంగ్రెస్ హయాంలో చేపట్టామన్నారు. ప్రతి గ్రామంలో క్యాంపులో సీసీ రోడ్లు తాగేనీరు ఆర్‌వో ప్లాంట్లు విద్యుత్ లైట్లు అంగన్‌వాడీ కేంద్రాలు పాఠశాలలు రైతులకు రోడ్లు ఏర్పాటు చేసి సమస్యలు తలెత్తుకున్న చేపట్టామని తెలిపారు. ప్రతి ఒక్కరు ప్రభుత్వ సదుపాయాలని ముందడుగు వేయాలన్నారు. అలాగే పిల్లల తల్లిదండ్రులు తమ పిల్లల్ని పాఠశాలకు చేర్చి విద్యావంతుల్ని తీర్చిదిద్దాలన్నారు. విద్యాభ్యాసం కోసం తమ ప్రభుత్వం ఎన్నో పథకాలు సదుపాయాలు కల్పించిందన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ మంజునాథ్ నాయక, ఆర్ఐ జగదీష్ గ్రామలెక్క అధికారి, పంచాయతీ అధ్యక్షురాలు శారద, గ్రామ పంచాయతీ సభ్యులు సంతోష్ క్యాంపు ప్రముఖులు చేకూరి నాగరాజు చేకూరి బాపిరాజు, ముదియనూరు కాళిరాజు, ఉమామహేశ్వర, తిరుపతయ్య, కంప్లి, ఎమ్మిగనూరు, కురుగోడు శ్రీరామచంద్ర క్యాంపు ప్రముఖులు, నాయకులు పాల్గొన్నారు.



లబ్ధిదారులకు పట్టాలు అందజేస్తున్న ఎమ్మెల్యే గణేష్

హోసూరు జోన్

అమ్మవారికి ఆషాఢ పూజలు



పటాలమ్మ దేవికి పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

హోసూరు, జూలై 4(ఆంధ్రజ్యోతి): ఆషాఢమాసం రెండో శుక్రవారం పురస్కరించుకుని హోసూరు నగరంలోని అమ్మవారి ఆలయాలలో విశేషపూజలు కొనసాగాయి. పటాలమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు జరిపారు. సరిహద్దులోని ఆనేకల్ తాలూకా నెరళూరు, చందాపుర, మాయసంద్ర, సర్జాపుర, అత్తిబెలె సహా హోసూరు 30కిపైగా గ్రామాలనుంచి భక్తులు పాల్గొన్నారు. తీర్థ ప్రసాదాలు పంపిణీ చేసి అన్నదానం నిర్వహించారు.



కార్పొరేషన్ కౌన్సిల్ సమావేశంలో పాల్గొన్న విద్యార్థులు

నీటి పన్ను పెంపునకు కౌన్సిల్ తీర్మానం

హోసూరు, జూలై 4(ఆంధ్రజ్యోతి): హోసూరు కార్పొరేషన్ అత్యవసర కౌన్సిల్ సమావేశంలో నీటి పన్ను పెంచాలని తీర్మానించారు. శుక్రవారం సమావేశానికి మేయర్ సత్య, డిప్యూటీ మేయర్ ఆనందయ్య, కమిషనర్ మహ్మద్ షబీర్ ఆలంలు అధ్యక్షత వహించారు. ప్రభుత్వభూమిలో ఇళ్లు నిర్మించుకున్న పేదలకు ఉచిత స్థలాలు ఇచ్చేలా రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. కార్పొరేషన్ సరిహద్దులో ఇళ్లు నిర్మించుకుని నివసిస్తున్న వారికి నిబంధనలను సడలించడం ద్వారా, వాటిని నియంత్రించడం ద్వారా ఉచిత స్థలాలను అందించాలనే కౌన్సిల్ తీర్మానించింది. కార్పొరేషన్ పరిధిలోని మిల్లత్‌నగర్, నంజప్పనగర్, వసంత్‌నగర్, పెరియార్‌నగర్, తిన్నూరు, సెన్నత్తూరు, వెంకటేశ్‌నగర్, సూదాచంద్రం, వౌసినగర్, అన్నామలైనగర్, అలవప్పల్లి, జూజువాడి, మూకొండపల్లి ప్రాంతాలలో నివసించేవారికి అభ్యంతరం లేకుండా ఇళ్లకు పట్టా జారీ చేయాలని తీర్మానించారు. రాజాకెనాల్ పునరుద్ధరణకు రూ.120కోట్లతో హోసూరు కార్పొరేషన్‌లో మరో లైబ్రరీ, 2 జోనల్ కార్యాలయాల ఏర్పాటుకు తమిళనాడు ప్రభుత్వం నిధులు అందించేందుకు ముందుకు వచ్చిందని మేయర్ తెలిపారు. హోసూరు కార్పొరేషన్‌లోని 6 చోట్ల ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలను ఏర్పాటు చేశారు. కార్పొరేషన్‌లో 5 లక్షల మొక్కలు నాటనున్నట్లు తెలిపారు. సమావేశంలో పలువురు తమ అభిప్రాయాలు వ్యక్తం చేశారు. కాగా కౌన్సిల్ సమావేశం వీక్షించేందుకు పాఠశాల విద్యార్థులకు అవకాశం కల్పించారు. పిల్లలు ఉత్సాహంగా సమావేశాన్ని పరిశీలించారు.

ఇంటి పట్టాలు ఇవ్వాలని ఆందోళన

హోసూరు, జూలై 4(ఆంధ్రజ్యోతి): ఉచిత ఇంటిపట్టాలు మంజూరు చేయాలని కోరుతూ వందలామంది డిమాండ్ చేశారు. కౌన్సిలర్ శంకర్ అలియాస్ కుపేంద్రన్ నేతృత్వంలో సబ్ కలెక్టర్ కార్యాలయానికి పిటీషన్ సమర్పించారు. రాయకోటై రోడ్డులోని రాజగణపతినగర్‌లో వందలాది ఇళ్లు ఉన్నాయి. వాటిలో కొన్నింటిని మాత్రమే సర్వే చేసి ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలని కోరారు. 40ఏళ్లుగా రాజగణపతినగర్‌లో ఉంటున్న తమకు ఇంటి పట్టా మంజూరు చేయాలని స్థానికులు కోరారు. రాజగణపతినగర్‌లోని ఇంటి స్థలాలను కొలిచారు. ఈ సందర్భంగా కొన్నింటికి కొలతలు తీసుకోలేదు. ఈ సందర్భంగా అధికారులను ప్రశ్నించగా కొంత ప్రదేశం తమిళనాడు హౌసింగ్ బోర్డు పరిధిలో ఉండడంతో తాము చర్యలు చేపట్టలేమని, బోర్డునుంచి ఎన్ఓసీ పొందితేనే ప్రక్రియకు వీలవుతుందన్నారు. ఈ మేరకు తమ వివరాలతో కలెక్టర్‌కు లేఖలు రాస్తూ సబ్ కలెక్టర్ కార్యాలయంలో సమర్పించారు. ఈ సందర్భంగా 50మంది పాల్గొన్నారు.



నిరసనలో రాజగణపతినగర్ వాసులు

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాలమ్...

పీవీ సింధు (పుట్టినరోజు)



దేశం గర్వించదగిన క్రీడాకారిణులలో ఒకరైన 'పద్మభూషణ్' గ్రహీత పూసర్ల వెంకట (పీవీ) సింధు 1995 జూలై 5న హైదరాబాద్‌లో జన్మించారు. కుడిచేతి వాటం కల్గిన బ్యాడ్మింటన్ క్రీడాకారిణి. 2016 రియో ఒలింపిక్స్‌లో రజతపతకం సాధించిన తొలి భారతీయ మహిళగా రికార్డు సృష్టించారు. 2012 సెప్టెంబరు 21న అంతర్జాతీయ బ్యాడ్మింటన్ సమాఖ్య ప్రకటించిన ర్యాంకింగ్స్‌లో టాప్2 జాబితాలో చోటు దక్కించుకోవడంతో తొలి సారిగా అంతర్జాతీయ గుర్తింపు లభించింది. 2013లో చైనాలో అంతర్జాతీయ బ్యాడ్మింటన్ సమాఖ్య నిర్వహించిన ప్రపంచ చాంపియన్‌షిప్‌లో పతకం సాధించి రికార్డు నెలకొల్పారు. 2022 స్విస్ ఓపెన్ టైటిల్ సాధించడంతోపాటు 2022 బ్యాడ్మింటన్ ఏసియా చాంపియన్‌షిప్‌లో సత్తా చాటారు. 2023 బ్యాడ్మింటన్ ఏషియా మిక్స్‌డ్ టీమ్ చాంపియన్‌షిప్‌లో కాంస్య పతకం సాధించారు. 2024 ఫిబ్రవరిలో బ్యాడ్మింటన్ ఏషియా టీమ్ చాంపియన్‌షిప్‌లో బంగారు పతకం సాధించారు. అర్జున, రాజీవ్ ఖేల్‌రత్న, 'పద్మశ్రీ', 'పద్మభూషణ్' తదితర గౌరవాలు అందుకున్నారు.

అలరించిన సానికా నృత్యం



సానికా

బెంగళూరు, జూలై 4(ఆంధ్రజ్యోతి): లక్ష్యా అకాడమీలో భరతనాట్యం నేర్చుకున్న సానికా నృత్య ప్రదర్శన అలరించింది. విద్వాన్ అనుశ్రీ వద్ద శిక్షణ పొందిన సానికా 'ఆరంట్' పేరిట నృత్యప్రదర్శన ఇచ్చారు. స్ఫూర్తి స్కూల్ ఆఫ్ డ్యాన్స్ డైరెక్టర్ సుమా రాజేశ్, కళాధ్యాన ఫౌండర్ డైరెక్టర్ రంజన శ్రీనివాస్, మృదంగ కళాకారుడు నారాయణస్వామి ముఖ్యులు పాల్గొన్నారు. వివిధ వాయిద్యకారుల సహకారంతో నృత్యప్రదర్శన సాగింది.

నోటు పుస్తకాల పంపిణీ



పుస్తకాలతో విద్యార్థులు

ముళబాగిలు, జూలై 4(ఆంధ్రజ్యోతి): దాతలు ఇచ్చే రాత సామగ్రిని సద్వినియోగం చేసుకుని విద్యాపరంగా పురోగతి సాధించాలని ప్రభుత్వ డీవీజీ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సీ సొణ్ణప్ప అభిప్రాయపడ్డారు. పట్టణంలోని డీవీజీ పాఠశాలలో ఉపాధ్యాయుల మిత్రబృందం వీరణ్ణగౌడ, వేమగల్ ప్రభుత్వ పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు వెంకటేశ్ ప్రాయోజకత్వంలో 2500 నోటు పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు చదవడంతోపాటు క్రమశిక్షణ, సంస్కారం అలవరుచుకోవాలని సూచించారు. ఎప్సాన్ కంపెనీ ఆధ్వర్యంలో 2 శుద్ధతాగునీటి యంత్రాలను సమకూర్చారు. పాఠశాలలోని ఎల్‌కేజీ, యూకేజీ విద్యార్థులకు యూనిఫాంతోపాటు నలి-కలి తరగతులకు అవసరమైన ఫర్నీచర్‌ను ఇచ్చారు. ఉపాధ్యాయులు ఎస్‌కే పద్మావతి, ఆర్ శారద, భారతి, ఎం మంజుళ, భాగ్యశ్రీ, కవిత, అరుణకుమారి తదితరులు పాల్గొన్నారు.

గ్రామాన్ని సందర్శించిన ఎంపీడీఓ

గుడిబండ, జూలై 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొంకల్లు గ్రామాన్ని ఎంపీడీఓ కేశవరెడ్డి శుక్రవారం సందర్శించారు. కొంకల్లు గ్రామానికి చెందిన పూజారి తిప్పన్న డెంగీతో మృతిచెందాడు. ఈ నేపథ్యంలో ఎంపీడీఓ గ్రామంలో పర్యటించి మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అధికారులు సక్రమంగా విధులు నిర్వహించి పంచాయతీ గ్రామాల్లో మురుగు కాలువలు, చెత్తాచెదారం వంటి వాటిని శుభ్రం చేయాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీఓ నాగరాజునాయక్, వైద్యాధికారి శ్రీనివాసనాయక్, పంచాయతీ కార్యదర్శి ప్రకాశ్, హరీష్ తదితరులు పాల్గొన్నారు.

కష్టపడి పనిచేయాలి

గుడిబండ(ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధికి అన్నిశాఖల అధికారులు కష్టపడి పనిచేయాలని ఎంపీడీఓ కేశవరెడ్డి, తహసీల్దార్ శ్రీధర్ పేర్కొన్నారు. శుక్రవారం మండలపరిషత్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధితోనే సమాజాభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీఓ నాగరాజు, పీడీఓలు త్యాగరాజ్, రామప్ప, రాజు, పంచాయతీ కార్యదర్శులు హరీష్, ఉపాధి హామీ సిబ్బంది లోకేష్, తిరుమల గౌడ్ పాల్గొన్నారు.

ఆటల్లోనూ ప్రతిభ చూపండి

పరిగి, జూలై 4(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలను గురువారం పరీక్షల విభాగం అధికారి లాజర్ పరిశీలించారు. ఆయన విద్యార్థులతో మాట్లాడుతూ క్రమశిక్షణతో చదివి ఉన్న స్థానాలు అధిరోహించాలని, అలాగే ఆటల్లో ప్రతిభను కనబరచి దేశానికి కీర్తిప్రతిష్ఠలు తేవాలన్నారు. అనంతరం ఉపాధ్యాయులతో భేటీ అయ్యి విద్యాబోధన చక్కగా చేయాలని, ఓపెన్‌స్కూల్‌పై ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ లక్ష్మీదేవి, శేషాచలం, హెచ్‌ఎం కృపాసత్యరాజ్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ గుర్తింపుతో బాధ్యత పెరిగింది

» రామయ్య ఆసుపత్రుల చైర్మన్ జయరాం వెల్లడి



మీడియాతో ఎంఆర్ జయరాం తదితరులు

బెంగళూరు, జూలై 4(ఆంధ్రజ్యోతి): రామయ్య మెమోరియల్ ఆసుపత్రికి జాయింట్ కమిషన్ ఇంటర్నేషనల్ (జేసీఐ) గుర్తింపు లభించడంతో బాధ్యత పెరిగిందని గోకుల ఎడ్యుకేషన్ ఫౌండేషన్ చైర్మన్ ఎంఆర్ జయరాం వెల్లడించారు. శుక్రవారం రామయ్య మెమోరియల్ ఆసుపత్రిలో మీడియాతో మాట్లాడారు. రామయ్య మెమోరియల్ ఆసుపత్రికి జేసీఐ 8వ విడతలోనే గుర్తింపు ఇచ్చింది. సమీక్ష జరిపేముందు 15 చాప్టర్‌లు, 237 స్టాండర్డ్స్, 1094 ప్రమాణాల ద్వారా ఆసుపత్రిని సంపూర్ణంగా పరిగణనలోకి తీసుకున్నారన్నారు. నాణ్యత, రోగుల భద్రత, పాలనా వ్యవహారాలలు, మెడికేషన్ మేనేజిమెంట్, ఇన్‌ఫెక్షన్ నియంత్రణ , ముందుజాగ్రత్తకు తీసుకున్నటువంటి చర్యలు అనే అంశాలపై సమగ్రంగా సర్వే చేశారన్నారు. సిబ్బంది నైపుణ్యత, వారు పొందిన శిక్షణలను పరిశీలించారన్నారు. పాలనా వ్యవహారాలలో నాయకత్వం, అభివృద్ధి, భద్రత, నైతిక విలువలు ఏ స్థాయిలో పాటిస్తున్నారనే అంశంపై కూడా సర్వే చేశారన్నారు. స్ట్రోక్, ఛాతీలో నొప్పి తదితర విభాగాలలో అమెరికన్ స్ట్రోక్ అసోసియేషన్, అమెరికన్ హార్ట్ అసోసియేషన్‌ల ప్రమాణాలను పరిగణించారన్నారు. గ్లోబల్ ఎడ్యుకేషన్ ఫౌండేషన్ హెల్త్‌కేర్ సర్వీసెస్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ డాక్టర్ నాగేందస్వామి, మదన్‌గైక్వాడ్ తదితరులు ఇతర ప్రముఖులు పాల్గొన్నారు.

ఎగుమతులతోనే పరిశ్రమలకు ప్రగతి



చర్చాగోష్ఠిలో పాల్గొన్న వివిధ సంస్థల ప్రతినిధులు బృందం

బెంగళూరు, జూలై 4 (ఆంధ్రజ్యోతి): పరిశ్రమల ఉత్పత్తులకు విదేశాలకు ఎగుమతి చేయడం ద్వారానే మరింత ప్రగతి సాధ్యమని పలువురు అభిప్రాయపడ్డారు. ఆస్పైర్ ఫర్ హర్ సీడ్ సహకారంతో పయనీర్ ప్రాయోజకత్వంలో చర్చాగోష్ఠి జరిగింది. అమెరికాకు చెందిన పయనీర్ సంస్థ రెండు దశాబ్దాలుగా లక్షలాదిమంది చిన్న, మధ్య తరహా మహిళా పారిశ్రామికవేత్తలకు సహకరిస్తోంది. దేశంలోని వివిధ ప్రాంతాల పరిశ్రమలలో స్థానికతకు అనుగుణంగా తయారయ్యే ఉత్పత్తులకు అంతర్జాతీయ మార్కెటింగ్ సహకరిస్తున్నారు. చర్చాగోష్ఠిలో బెంగళూరులోని ఆస్ట్రేలియా రాయబారి ఆండ్ర్యూ కాలిస్టర్, రిటైల్ డిజైన్ సొల్యూషన్స్ ఫౌండర్ జుహి సంతాని, వింధ్య ఇ-ఇన్ఫోమీడియా ఎండీ పవిత్ర వైఎస్‌లు పాల్గొన్నారు. షి ఎక్స్‌పోర్ట్ అనేది కేవలం ఎక్స్‌పోర్ట్‌కే ప్రాధాన్యత ఇవ్వడం లేదని మనుష్యుల ఆలోచనలను సాంకేతికంవైపు తీసుకెళ్లనుందని ఆస్పైర్ ఫర్ ఫౌండర్ సీఈఓ మధురదాస్ గుప్త అభిప్రాయపడ్డారు. షి ఎక్స్‌పోర్ట్ ద్వారా వేలాదిమంది మహిళా పారిశ్రామికవేత్తల కలలకు సాకారం సాధ్యమవుతోందన్నారు. పయనీర్ ఇండియా మార్కెటింగ్ మేనేజర్ సలోని వైష్ణవ్‌తోపాటు పలువురు పాల్గొన్నారు.

డిస్నీ థీమ్‌పార్క్ ఏర్పాటు చేయండి

» సర్కారుకు బీసీఐసీ డిమాండ్



బీసీఐసీ సభలో వాణిజ్య పరిశ్రమలశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సెల్వకుమార్, సభ్యులు

బెంగళూరు, జూలై 4(ఆంధ్రజ్యోతి): బెంగళూరులో డిస్నీ థీమ్‌పార్క్‌ను ఏర్పాటు చేయాలని బెంగళూరు చాంబర్ ఆఫ్ ఇండస్ట్రీ అండ్ కామర్స్ (బీసీఐసీ) సభలో సర్కారుకు ప్రతిపాదించారు. గురువారం రాత్రి 48వ జనరల్‌బాడీ మీటింగ్ జరిగింది. వాణిజ్య పరిశ్రమలశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సెల్వకుమార్, బీబీఎంపీ కమిషనర్ మహేశ్వర్‌రావ్, ఎస్‌బీఐ జీఎం జుహిస్మిత సిన్హా, బ్రిగేడ్ గ్రూప్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎంఆర్ జయశంకర్‌లు పాల్గొన్నారు. దేవనహళ్ళి ఎయిర్‌పోర్ట్ ప్రాంగణంలో డిస్నీల్యాండ్ తరహాలో థీమ్‌పార్క్‌ను ప్రారంభించాలని సూచించారు. సెల్వకుమార్ మాట్లాడుతూ కర్ణాటక ఎగుమతులలో దేశంలోనే నెంబరువన్‌గా ఉందని, జీఎస్టీ, ఐటీలలో రెండోస్థానంలో కొనసాగుతోందన్నారు. బీబీఎంపీ కమిషనర్ మాట్లాడుతూ నగరంలో మౌలిక సదుపాయాలు పెంచేందుకు కట్టుబడ్డామని, ఆగస్టులో ఎల్లోలైన్ మెట్రో సేవలు అందుబాటులోకి తెస్తామన్నారు. బీసీఐసీ చైర్మన్ వినీత్‌వర్మ మాట్లాడుతూ బీసీఐసీని కార్పొరేటీకరణ చేయడం కొత్తదనానికి నాంది అన్నారు. నామినేటెడ్ చైర్మన్ ప్రశాంత్ గోఖలే బాధ్యతలు చేపట్టిన సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో పరిశ్రమలు మరింత పెరగాల్సి ఉందని, ఆ దిశగా తమవంతు సహకారం అందిస్తామన్నారు. బీసీఐసీలో 950మంది సభ్యులు ఉన్నారన్నారు.

వక్ఫ్ బోర్డును కాపాడాలని ఆందోళన



ప్లకార్డులతో మానవహారం ఇలా...

బాగేపల్లి, జూలై 4(ఆంధ్రజ్యోతి): వక్ఫ్‌బోర్డును కాపాడాలంటూ పట్టణంలోని 14 మసీదుల ముందు శుక్రవారం ప్రార్థనల అనంతరం ప్రత్యేక మానవహారం నిర్వహించారు. వక్ఫ్ మనుగడకోసం రాజ్యాంగాన్ని రక్షించాలంటూ ప్లకార్డులు ప్రదర్శించారు. పట్టణ శివారులోని మద్రసా మసీదు, జామియా మసీదు, ఖమర్, మదీనా, నూరాని, ఫారూక్, ఆజం తదితర 14 మసీదులలో ముస్లింలు ప్రార్థనలు నిర్వహించిన అనంతరం ప్లకార్డులు చేతబట్టి నినాదాలు చేశారు. వక్ఫ్‌ను కాపాడాలని, రాజ్యాంగాన్ని రక్షించాలంటూ నినాదాలు చేశారు. కేంద్రప్రభుత్వం వక్ఫ్ చట్టాలను సవరించి లోక్‌సభ, రాజ్యసభలో ఆమోదం పొందిందన్నారు. ఇది ముస్లిం ధార్మిక హక్కులకు భంగమని ఆదిల్‌ఖాన్ అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా మసీదులకు చెందిన ధర్మగురువులు, మౌలానాలు, కమిటీ పదాధికారులు పాల్గొన్నారు.

రైతుల పోరాటానికి మద్దతు

శిడ్లఘట్ట, జూలై 4(ఆంధ్రజ్యోతి): దేవనహళ్ళి తాలూకా చన్నరాయపట్టణ చుట్టుపక్కల 13 గ్రామాలకు చెందిన రైతులనుంచి భూస్వాధీనానికి సిద్ధం కావడాన్ని వ్యతిరేకిస్తూ బెంగళూరు ఫ్రీడం పార్కులో చేపట్టిన భారీ నిరసనకు తాలూకానుంచి మద్దతు వ్యక్తమైంది. తాలూకానుంచి వందలాదిమంది బస్సులు, కార్లలో బయల్దేరినట్టు రైతుసంఘం గౌరవాధ్యక్షుడు భక్తరహళ్ళి చన్నేగౌడ తెలిపారు. దళిత సంఘర్ష సమితి సంచాలకులు వెంకి మాట్లా డుతూ రైతుసంఘానికి తాము మద్దతు ఇస్తున్నట్టు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కార్యాధ్యక్షుడు మారుతి, తాలూకా అధ్యక్షుడు రవి ప్రకాశ్, విజ్జం నాగరాజ్, ద్యావప్ప, శ్రీనివాస్, శంకర్ నారాయణ, మహిళా అధ్యక్షురాలు అనితమ్మ తదితరులు పాల్గొన్నారు.



శిడ్లఘట్ట నుంచి బయల్దేరుతున్న రైతుసంఘం సభ్యులు

ఆన్‌లైన్‌లో భూ రికార్డుల కోసం నిరసన



గరుడకెంపనహళ్ళిలో రైతుల నిరసన

బంగారపేట, జూలై 4 (ఆంధ్రజ్యోతి): తాలూకాలోని యళెసంద్ర గ్రామ పంచాయతీ పరిధిలోని గరుడకెంపనహళ్ళి సర్వే 3లో ఒక ప్రభావిత వ్యక్తి తమ గ్రామంలో భూమి కొన్నప్పటి నుంచి ఆన్‌లైన్‌లో భూ రికార్డులు రావడం లేదని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. వందేళ్లక్రితమే తమ తాత ముత్తాల పేరిట మంజూరైందని అందుకు సంబంధించిన అన్ని రికార్డులు తమ వద్ద ఉన్నాయన్నారు. మూడేళ్లక్రితం ఒక వ్యక్తిగత భూమి కొనుగోలు చేసినప్పటి నుంచి సుమారు 40మంది రైతుల భూరికార్డులు ఆన్‌లైన్‌లో అందడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తూ నిరసన తెలిపారు. ఇటీవల ఆన్‌లైన్‌లో పహణికి సంబంధించిన రికార్డులు రాకపోవడంతో సమస్యలు ఎదుర్కొంటున్నట్టు వాపోయారు. రాగి, కంది తదితర పంటలకు ప్రభుత్వం నుంచి ఎలాంటి సౌలభ్యాలు అందడం లేదన్నారు. ఇందుకు సం బంధించి పలుమార్లు గ్రామ పాలనాధికారి, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, తహశీల్దార్‌ల దృష్టికి తెచ్చినా ప్రయోజనం లేకపోయిందన్నారు. రాజకీయ నాయకుల ఒత్తిడికి తలొగ్గి తమకు అన్యాయం చేస్తున్నారని ఇకనైనా ఉన్నతాధికారులు స్పందించి తగిన న్యాయం చేయాలని కోరుతున్నారు. ఈ సందర్భంగా రవి, మునిరాజు, చలపతిరెడ్డి, వెంకటేశ్‌రెడ్డి, రామప్ప, లక్ష్మయ్య, మూర్తి, మల్లేశ్, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

హాలనాయకనహళ్లిలో గ్రామసభ



గ్రామపంచాయతీ సమావేశంలో డ్రై ఫ్రూట్స్ అందజేత

దొమ్మసంద్ర, జూలై 4(ఆంధ్రజ్యోతి): బెంగళూరు తూర్పు తాలూకా మహదేవపుర శాసనసభ నియోజకవర్గ పరిధిలోని హాలనాయకనహళ్ళి గ్రామ ఎంచాయతీ 2025-26 వార్షిక తొలి గ్రామసభ గురువారం జరిగింది. పంచాయతీ అధ్యక్షురాలు సవితా బాబురెడ్డి అధ్యక్షతన ప్రజల సమస్యలు ఆలకించారు. స్థానికంగా ఉన్న చెరువు చెత్తాచెదారంతో కలుషితం అవుతోందని, చెరువు నిండితే రాజకాలువ లేకపోవడంతో రోడ్డు, స్మశానానికి నీరు వెళ్తోందన్నారు. గ్రామసభలో ఒక్కొక్కరు తమ సమస్యను వివరించారు. చెరువు నీరు కలుషితం కాకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. చిక్కనాయకనహళ్ళి కాలనీలో 40 ఇళ్లకు హక్కుపత్రాలు, ఇ-ఖాతా చేయలేదన్నారు. అభివృద్ధి అధికారి నరసింహరాజు, అధ్యక్షురాలు సవితా బాబురెడ్డి ప్రజల ప్రశ్నలకు సమాధానమిస్తూ పరిష్కరిస్తామన్నారు. ఇదే సందర్భంగా 600మంది కూలికార్మికులకు డ్రై ఫ్రూట్స్ బాక్స్ పంపిణీ చేశారు. సమావేశంలో ఉపాధ్యక్షులు భాగ్యలక్ష్మి వెంకటేశ్, కార్యదర్శి సొన్నప్ప, సభ్యులు అనిల్‌రెడ్డి, శివారెడ్డి, శ్వేతా సురేశ్, మంజునాథ్, హెచ్‌పీ గీతా లోకేశ్, శోభా రమేశ్, మంజునాథ్ తదితరులు పాల్గొన్నారు.

ఏడాది చివరినాటికి అండర్‌గ్రౌండ్ కేబుల్ పనులు



మీడియాతో కేపీసీసీ కార్యదర్శి మంజునాథ్ తదితరులు

విజయపుర, జూలై 4 (ఆంధ్రజ్యోతి): అండర్ గ్రౌండ్ కేబుల్ ద్వారా విజయపుర పట్టణాన్ని సురక్షితంగా తీర్చిదిద్దడమే లక్ష్యమని కేపీసీసీ కార్యదర్శి వీ మంజునాథ్ అభిప్రాయపడ్డారు. ప్రభుత్వ అతిథిగృహంలో శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ నియోజకవర్గ ఎమ్మెల్యే, మంత్రి కేహెచ్ మునియప్ప, విద్యుత్‌శాఖ మంత్రి కేజే జార్జ్‌తో కలసి జరిపిన చర్చలు ఫలించాయన్నారు. ఏడాది చివరలోగా అండర్‌గ్రౌండ్ పనులు పూర్తి కానున్నాయన్నారు. ఈమేరకు 29.26 కోట్ల రూపాయల పనులకు ఆగస్టులో టెండరు ప్రక్రియ ఉంటుందని, ఏడాది ఆఖరులోగా పనులు పూర్తవుతాయన్నారు. ఈ సందర్భంగా విజయపుర టౌన్ కాంగ్రెస్ అధ్యక్షుడు వీఎం నాగరాజు, ఐదు గ్యారెంటీల అమలు సమితి తాలూకా సభ్యుడు కోకోకోలా మంజునాథ్, ముబారక్, పురసభ సభ్యుడు ఎం నారాయణస్వామి ఇతర స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి ఏకాదశి ఉత్సవాలు

మడకశిర రూరల్, జూలై 4(ఆంధ్రజ్యోతి): తొలి ఏకాదశిని పురస్కరించుకుని ఆదివా రం నుంచి రెండు రోజులపాటు భ క్తరహళ్లి నరసింహస్వామి, జిల్లేడు గుంట ఆంజనేయస్వామి ఆ లయాల్లో ఉత్సవాలు నిర్వహిస్తున్నటుల దేవదాయశాఖ ఈఓ నరసింహరాజు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం సా యంత్రం 8 గంటల నుంచి స్వా మి వారికి అభిషేకాలు, ఆకుపూజ జరుగుతాయన్నారు. రాత్రి 12 గం టలకు స్వామివారి ఉత్సవమూర్తి ఊరేగింపు ఉంటుందన్నారు. 7న మధ్యాహ్నం 12 గంటలకు భూతప్పల ఉత్సవం, 8న హుండీ లెక్కింపు ఉంటుందని తెలిపారు. మండలంలోని గుంతపల్లి శ్రీలక్ష్మీ నరసింహస్వామి ఆలయం వద్ద ఆదివారం నుంచి తొలిఏకాదశి ఉత్సవాలు మూడురోజులపాటు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఆదివారం తొలిఏకాదశిరోజు జ్యోతుల ప్రదర్శన, సోమవారం ఎడ్లబండ్ల ఊరేగింపు, మంగళవారం ఉట్లపరుష ఉంటుందన్నారు.

చీఫ్ సెక్రటరీపై

అనుచిత వ్యాఖ్యలు చేయలేదు

» ఎమ్మెల్సీ రవికుమార్ - కాంగ్రెస్ ఫిర్యాదుతో ఎఫ్ఐఆర్ నమోదు



ఎమ్మెల్సీ రవికుమార్

బెంగళూరు, జూలై 4(ఆంధ్రజ్యోతి): చీఫ్ సెక్రటరీ పట్ల అనుచితమైన వ్యాఖ్యలు చేయలేదని బీజేపీ ఎమ్మెల్సీ రవికుమార్ వివరణ ఇచ్చారు. అనుచితమైన వ్యాఖ్యలు చేయలేదని, చెడు ఆలోచనతో మాట్లాడలేదని, ముఖ్యమంత్రికి వ్యతిరేకంగాను మాట్లాడలేదన్నారు. అనుచిత వ్యాఖ్యలు నిరాధారమన్నారు. కేంద్ర మంత్రి ప్రహ్లాద్‌జోషిని కలసి వివరణ ఇవ్వదలిచానన్నారు. కాగా రవికుమార్ చుట్టూ ఉచ్చు బిగుస్తోంది. కాంగ్రెస్‌పార్టీకి చెందిన వివిధ వర్గాలు సభాపతికి ఫిర్యాదు చేశారు. మరోవైపు మహిళా కమిషన్‌కు ఫిర్యాదు చేసి వివిధ పోలీస్ స్టేషన్లలో ఫిర్యాదు చేశారు. మరోవైపు ఐఏఎస్ అధికారులు ముఖ్యమంత్రిని కలసి ఈ విధంగా అవమానించడం ఎంతవరకు సమంజసమని, అధికారుల ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీసేలా ఉందని వివరించారు.

కాగా రవికుమార్ వ్యాఖ్యలు సరికాదని బీజేపీ సీనియర్ నేత సదానందగౌడ తప్పుబట్టారు. గతంలోనూ జిల్లా అధికారి పట్ల ఇదే విధమైన వ్యాఖ్యలు చేశారన్నారు. దీంతో చట్టపరంగా రవి కుమార్‌కు ఎదురుదెబ్బలు తప్పవనే ప్రచారం సాగుతోంది. మరోవైపు రవి కుమార్ ఈ వివాదం నుంచి బయటపడేందుకు హైకోర్టులో పిటీషన్ దాఖలు చేశారు.

వెండి సామగ్రికి పూజలు



విశేష పూజల్లో నిర్వాహకులు తదితరులు

బెంగళూరు, జూలై 4 (ఆంధ్రజ్యోతి): అయోధ్యలో బాల రాముడి ఆలయ పరిధిలోని 8 ఉప ఆలయాలకు అవసరమైన వెండి పూజాసామగ్రికి నగరంలో ప్రత్యేక పూజలు జరిపారు. శుక్రవారం విజయనగర్‌లోని రాజహంస కన్వెన్షన్ హాల్‌లో స్వస్తి వాచన, పుణ్యాహవచన, వాస్తుపూజ, స్నపన తిరుమం జనంతోపాటు సీతారాముల కల్యాణోత్సవం జరిపారు. నగరానికి చెందిన అయోధ్య రామసేవామండలి కృష్ణకుమార్ కుటుంబీకులు, రాజేంద్రనాయుడు, రావిళ్ల ఆదికేశవులు నాయుడు, రాజహంస రవీంద్రనాథ్, ఏఎస్ ప్రభాకర్ గుప్త, ఏజీ ప్రసాద్, హనుమేశ్ కుటుంబీకులు వెండి పూజాసామగ్రిని సిద్ధం చేశారు. ఒక్కో ఉప ఆలయానికి అవసరమైన పూజాసామగ్రిని 7-8 కేజీల వెండితో తయారు చేయించారు. ఈ సందర్భంగా రాజేంద్రనాయుడు మాట్లాడుతూ అయోధ్యలో రామమందిరానికి వెండి పూజాసామగ్రిని గత ఏడాది అందించే అవకాశం కలసి వచ్చిందన్నారు. అదే తరహాలోనే ఉప ఆలయాలకు వెండి సామగ్రిని 8 కుటుంబాలు సమకూర్చాయన్నారు. వీటిని త్వరలోనే అయోధ్యలో అప్పగిస్తామన్నారు. కార్యక్రమంలో పలువురు స్వామిజీలు పాల్గొన్నారు.

ఇండియన్ రేసింగ్‌లో కిచ్చస్ కింగ్స్ బెంగళూరు



కిచ్చస్ బెంగళూరు ఫ్రాంచైజీ ప్రారంభంలో నటుడు కిచ్చ సుదీప్

బెంగళూరు, జూలై 4 (ఆంధ్రజ్యోతి): దేశంలోని ప్రముఖ నగరాలలో మోటార్ స్పోర్ట్స్ లీగ్ ఇండియన్ రేసింగ్ ఫెస్టివల్‌లో కొత్త అధ్యయనం ప్రారంభమైంది. కన్నడ స్టార్ కిచ్చసుదీప్ బెంగళూరు ఫ్రాంచైజీని దక్కించుకున్నారు. 'కిచ్చస్ కింగ్స్ బెంగళూరు'ను లాంఛనంగా శుక్రవారం ప్రముఖ నటుడు కిచ్చ సుదీప్ ప్రారంభించారు. ఆగస్టు నుంచి ఇండియన్ రేసింగ్ ఫెస్టివల్ ప్రారంభం కానుంది. బెంగళూరు, ఢిల్లీ, హైదరాబాద్, కోల్కత్తా, గోవాతోపాటు పలు ఫ్రాంచైజీ బృందాలు పాల్గొననున్నాయి. ఇది ఓ టీం కాదని భావనాత్మకమని, సినిమా తరహాలోనే రేసింగ్ కూడా ఉత్సాహం కలిగించేదన్నారు. రేసింగ్ ఫెస్టివల్ చైర్మన్ సీఎండీ అఖిలేశ్‌రెడ్డి మాట్లాడుతూ సుదీప్ వంటి సూపర్‌స్టార్ రేసింగ్‌లో ఫ్రాంచైజీ తీసుకోవడం సంతోషంగా ఉందన్నారు. ఇదే సందర్భంగా రేసింగ్ టీషర్ట్ లోగో ఆవిష్కరించారు.

బీఎస్‌డబ్ల్యూలో టాపర్‌గా సిస్టర్ రీటా దీపక్



రీటా దీపక్‌ను అభినందిస్తున్న అధ్యాపకులు

బెంగళూరు, జూలై 4(ఆంధ్రజ్యోతి): 2023-24 విద్యాసంవత్సరంలో బెంగళూరు కాక్స్‌టౌన్‌లోని ఉత్తర విశ్వవిద్యాలయంలో బ్యాచిలర్ ఆఫ్ సోషల్ వర్క్ (బీఎస్‌డబ్ల్యూ)లో 82.61 శాతం మార్కులతో సిస్టర్ రీటా దీపక్ టాపర్‌గా నిలిచారు. ప్రథమస్థానం సాధించిన విద్యార్థినిని సెయింట్ అలోసియస్ డిగ్రీ కళాశాల డైరెక్టర్, ప్రిన్సిపాల్, అధ్యాపక సిబ్బంది శుక్రవారం ప్రత్యేకంగా అభినందించారు.

మహిళల సమస్యలపై ఐక్య ఉద్యమాలు

● ఐద్వా రాష్ట్ర కోశాధికారి సావిత్రి


మాట్లాడుతున్న ఐద్వా రాష్ట్ర కోశాధికారి సావిత్రి

అనంతపురం టౌన్, జూలై 4(ఆంధ్రజ్యోతి): మహిళ సమస్యల పరిష్కారం కోసం ఐక్య ఉద్యమాలు చేపడతామని ఐద్వా రాష్ట్ర కోశాధికారి సావిత్రి పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని గణేనాయక్ భవన్‌లో శుక్రవారం నిర్వహించిన ఐద్వా నగర 8వ మహాసభకు ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. తొలుత ఐద్వా వ్యవస్థాపకుల్లో ఒకరైన మానికొండ సూర్యవతి వర్ధంతిని పురస్కరించుకుని ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం నిర్వహించిన సభలో సావిత్రి మాట్లాడుతూ దేశంలో, రాష్ట్రంలో రోజురోజుకూ మహిళలపై హింస పెరిగిపోతోందన్నారు. రాష్ట్రంలో వరుసగా అమానుష ఘటనలు జరుగుతుండటం ఆవేదన కలిగిస్తోందన్నారు. పాలకులు సంఘటనలు జరిగినప్పుడు హడావుడిగా బాధితుల పక్షాన మాట్లాడి, ఆ తర్వాత మిన్నకుండిపోతున్నారని విమర్శించారు. మహిళల సమస్యల పరిష్కారానికి పోరాటాలను ఉధృతం చేస్తామన్నారు. మహాసభల సందర్భంగా మూడు తీర్మానాలను ఏకగ్రీవంగా సభలో ఆమోదించారు.

ఐద్వా నగర కమిటీ ఎన్నిక

ఐద్వా నగర మహాసభల్లో భాగంగా నగర కమిటీని ఎన్నుకున్నారు. ఐద్వా నగర కమిటీ నూతన అధ్యక్షురాలుగా శంషాద్, ప్రధాన కార్యదర్శిగా అశ్విని, కోశాధికారిగా గీత, ఆఫీస్ బేరర్లుగా పద్మ, శైలజ, లక్ష్మి, పర్యాబీ, తులసితోపాటు ఆఫీస్ బేరర్లు మొత్తం 26 మందితో నగర కమిటీని ఎన్నుకున్నారు.

అర్ధరాత్రి ఆస్పత్రిలో..

అయినవారి ప్రాణం నిలుపుకోవడం కోసం పేదలు ఆత్రంగా అనంతపురం పెద్దాస్పత్రికి వస్తున్నారు. అర్ధరాత్రి కూడా క్యూ కడుతున్నారు. వార్డుల్లో బెడ్లు ఖాళీగా ఉండటం లేదు. దీంతో ఆసుపత్రి ఆవరణం రోగులు, వారి సహాయకులతో నిండిపోతోంది. పగలు ఎలాగోలా గడిపినా.. రాత్రి అయితే నిద్రకు ఇబ్బంది పడుతున్నారు. ఖాళీ దొరికిన చోట కునుకు తీస్తున్నారు. దోమలు, చలిగాలి, చినుకులతో అవస్థలు పడుతున్నారు. ఇక్కడ ఇలాంటి దృశ్యాలు సర్వసాధారణం. గురువారం అర్ధరాత్రి తీసిన ఫొటోలు ఇవి..

- ఆంధ్రజ్యోతి, అనంతపురం వైద్యం


మనవారి బండి..
మనం తోయాల్సిందేనండీ..!


చోటు దొరికితే చాలు.. సిమెంటు దిమ్మెలే పూల పాన్పులు..


అలసి సొలసి కొందరు.. చింత చేస్తూ మరికొందరు..

ఇప్పుడెలా..?


చిన్నంపల్లి గ్రామ సమీపంలో వేసిన లే అవుట్

అనంతపురంరూరల్, జూలై 4(ఆంధ్రజ్యోతి): పంచాయతీల్లో బిల్డింగ్ అప్రూవల్స్ బంద్ అయ్యాయి. దీంతో అసలే నిధులు లేక అల్లాడుతున్న పంచాయతీల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ఈ ఆర్థిక సంవత్సరం మొదటి నుంచి అహుడా అధికారులు పంచాయతీ అప్రూవల్ బిల్డింగ్ ఆన్‌లైన్ సైట్‌ను నిలిపేశారు. ఫలితంగా బిల్డింగ్ అప్రూవల్స్ ప్రక్రియ పూర్తిగా ఆగిపోయింది. ఈక్రమంలో పంచాయతీకి అప్రూవల్స్ ద్వారా వచ్చే నిధులకు గండి పడింది. దీంతో నిధులు లేక స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు అవస్థలు పడుతున్నారు. ఇంటి పన్ను కూడా అంతంతమాత్రంగానే వసూలు అవుతోంది. దీంతో నిధులు లేక పంచాయతీల్లో చిన్నిచిన్న పనులు కూడా చేయలేకపోతున్నారు. పంచాయతీ బిల్డింగ్ అప్రూవల్ సైట్ నిలుపుదల వెనుక రాజకీయ నాయకుల ప్రమేయం ఉందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

అక్రమ లేఅవుట్ల నియంత్రణ పేరిట..

అక్రమ లేఅవుట్ల నియంత్రణ కోసమే అహుడా అధికారులు పంచాయతీలకు బిల్డింగ్ అప్రూవల్స్ నిలిపివేసినట్లు సమాచారం. కొత్తగా వెలుస్తున్న లేఅవుట్ల విషయంలో అహుడా అధికారులు నిబంధనలు అమలు చేస్తే ఉపయోగం ఉంటుంది. కానీ పాత వాటిలోనూ ఇదే విధంగా వ్యవహరించడం వల్ల ఇబ్బందులు తలెత్తుతు న్నాయి. అహుడా ఏర్పడినప్పటి నుంచి అధికారులు

నిబంధనలు ఖచ్చితంగా అమలు చేసుంటే ఈ పరిస్థితి ఉండేది కాదంటున్నారు. ఇప్పటికే పాత లేవుట్లలో క్రయ విక్రయాలు జరిగిపోయాయి. పాత లేఅవుట్లలో కొందరూ నిబంధనలు పాటించగా, మరికొందరు పాటించలేదు. నిబంధనల ప్రకారం ఉన్న లేఅవుట్లు పదుల సంఖ్యలో ఉంటే, నిబంధనలు ప్రకారం లేనివి వందల సంఖ్యలో ఉన్నాయి. వీటిలో కూడా పంచాయితీ అధికారులు నిబంధనల ప్రకారం ఆన్‌లైన్ చలాన కట్టించుకుని బిల్డింగ్ అప్రూవల్స్‌కు అనుమతులు ఇచ్చారు. ఇప్పుడు అహుడా అధికారులు చేపట్టిన చర్యలతో వాటిలో కూడా అనుమతులు ఇచ్చేందుకు వీలు లేకుండా పోయింది.

పంచాయతీ ఆదాయానికి గండి..

బిల్డింగ్ అప్రూవల్స్ నిలుపుదలతో పంచాయతీల ఆదాయానికి పెద్ద మొత్తంలో గండిపడుతోంది. అనంతపురం రూరల్ మండల పరిధిలోని పంచాయతీల్లో నెలకు కనీసం ఐదారు అప్రూవల్స్ జరుగుతున్నాయి. దీంతో స్థలం విలువలో యజమానుల నుంచి పంచాయతీకి 14శాతం పన్ను రూపంలో ఆదాయం సమకూరుతోంది. ఒక్కో అప్రూవల్‌కు కనీసం రూ.లక్షకుపైగానే ఆదాయం వస్తోంది. దీంతోనే పంచాయతీల్లో చిన్నచిన్న మరమ్మతులు చేయించడం, వీధి లైట్లు ఏర్పాటు చేయడం, కార్మికుల వేతనాలు చెల్లింపులు ఇతరత్ర జరిగేది. అయితే అహుడా అధికారులు బిల్డింగ్ అప్రూవల్ సైట్ నిలిపివేయడంతో మూడు నెలలుగా పంచాయతీలకు వచ్చే ఆదాయం పూర్తిగా పడిపోయింది.

అనుమతులంటే హడల్

అనంతపురం చుట్టుపక్కల ప్రాంతాల్లో నాలుగు సెంట్లలో ఇల్లు కట్టాలంటే అనుమతులకే లక్షలు చెల్లించాల్సి ఉంది. ఇప్పటి అహుడా నిబంధనల ప్రకారం అనుమతులు పొందాలంటే నాలుగు సెంట్లకు అనంతపురం రూరల్ మండల పరిసర ప్రాంతాల్లో కనీసం రూ.నాలుగైదు లక్షలు చెల్లించాల్సిన పరిస్థితి ఉంది. పంచాయతీకి 14శాతం టాక్స్ చెల్లించడంతోపాటు లేబర్ సెస్సు, అహుడా అనుమతుల ఫీజు ఇలా తడిసిమోపెడవుతున్నట్లు గృహనిర్మాణదారులు వాపోతున్నారు. ఇంత మొత్తం చెల్లించే బదులు..అనుమతులకు వెళ్లడమే మానేస్తే మేలుకదా అంటున్నారు. అధికారుల అనాలోచిత నిర్ణయాలతో ఇబ్బందులు తప్ప ఒరిగింది ఏమీలేదన్న వాదనలు వినిపిస్తున్నాయి.

మాన్యువల్ అనుమతులకు దారి..

అహుడా అధికారుల తీరుతో కొన్ని పంచాయతీల్లో మాన్యువల్ అనుమతులు ఇస్తున్నట్లు సమాచారం. ఈ ప్రక్రియతో గతంలో గృహనిర్మాణదారులు ఇబ్బందులు పడినట్లు సమాచారం. అనుమతులకు సంబంధించిన వివరాలు సంబంధిత పంచాయతీ రికార్డుల్లో లేకపోవ డం వంటి సమస్యలు తలెత్తాయి. అందుకే బిల్డింగ్ అప్రూవల్స్ ఆన్‌లైన్ చలానా తప్పనిసరి చేశారు. దీంతో ఆదాయం నేరుగా పంచాయతీ ఖజానాలోకి వచ్చి చేరుతోంది. అయితే ప్రస్తుతం అహుడా అధికారులు చేపట్టిన చర్యలతో పరిస్థితి గతంలో మాదిరిగానే మారుతోందన్న వాదనలు వినిపిస్తున్నాయి. ఇళ్ల నిర్మాణాదారులకు పంచాయతీ అనుమతులుంటే బ్యాంకులు రుణాలు ఇస్తాయి. దీంతో కొందరు పంచాయతీ అధికారులు అందినకాడికి దండుకుని బిల్డింగ్ అనుమతులు మాన్యువల్‌గా చేస్తున్నట్లు తెలిసింది. దీంతో భవిష్యత్తులో ఇంటి యజమానులకు అనేక సమస్యలు తలెత్తుతాయన్న వాదనలు వినిపిస్తున్నాయి. గతంలో ఇలా అనుమతులు పొందిన వారు ఇప్పుడు అవస్థలు పడుతున్నట్లు సమాచారం.

నింబంధనల ప్రకారమే...



ఏప్రిల్ నుంచి పంచాయతీల్లో బిల్డింగ్ అప్రూవల్స్ నిలిపివేసిన విషయం వాస్తవమే. అహుడా అధికారులు అక్రమ లేఅవుట్ల నియంత్రణకు ఈ చర్యలు తీసుకున్నారు. అయితే ఎల్‌పి నెంబరు, టౌన్‌ప్లానింగ్, అహుడా నిబంధనల ప్రకారం ఉన్న లేఅవుట్లలో బిల్డింగ్ నిర్మాణాలకు అనుమతులు ఇస్తున్నాం. ప్రస్తుతం అక్రమ లేఅవుట్లలో ఎలాంటి అనుమతులు ఇవ్వడం లేదు. ఎవరైనా ఇచ్చినా వారిపై చర్యలు తప్పవు.

- వెంకటనాయుడు, డిప్యూటీ ఎంపీడీఓ,
అనంతపురం రూరల్ మండలం

ఏంటి బాస్ ఇది..?


సపర్యలు చేస్తున్న తోటి బాధిత మహిళా సంరక్షణ కార్యదర్శులు


అనంతపురం క్రైం, జూలై 4(ఆంధ్రజ్యోతి): బదిలీల బాధితులపై ఉన్నతాధికారులు బాసిజం చూపారు. తమకు అన్యాయం చేశారని, తమ సమస్యలు వినాలంటూ డీపీఓ(జిల్లా పోలీస్ కార్యాలయం)కు వచ్చిన గ్రామ, వార్డు సచివాలయ మహిళా సంరక్షణ కార్యదర్శుల (ఎంఎస్‌కే)ను కనీసం గేటు కూడా దాటనివ్వలేదు. డీపీఓలోకి రాకూడదంటూ గేటు వద్దే పోలీసులు అడ్డుకున్నారు. పోలీస్ బాస్‌కు ఉద్యోగినుల సమస్యలు వినే తీరిక కూడా లేదా అంటూ బాధితులు ఆక్రోశంతో అక్కడి నుంచి వెనుతిరిగారు. శుక్రవారం సుమారు 20 మంది ఎంఎస్‌కేలు తమ సమస్యలను విన్నవించుకోడానికి డీపీఓ వద్దకు వెళ్లారు. వారిని గేటు వద్ద ఉన్న పోలీస్ సిబ్బంది అడ్డుకున్నారు. మహిళా సంరక్షణ కార్యదర్శులు కొన్ని రోజులు ఎవరూ ఇటువైపు రాకూడదని, వచ్చినా అనుమతించకండి అంటూ ఉన్నతాధికారుల ఆదేశించారని అడ్డుకున్నారు. దీంతో మహిళా పోలీసులు ఏం చేయాలో తెలియక అక్కడే ఉన్న వేమన టెలిఫోన్ భవన్ వద్ద పడిగాపులు కాశారు. తమ శాఖా ఉన్నతాధికారులే తమకు లోపలికి అనుమతించకుంటే, తమ గోడు వినేదెవరు అంటూ ఆవేదన వ్యక్తం చేశారు.

కళ్లు తిరిగి కిందపడిన బాధితురాలు

డీపీఓ వద్దకు వచ్చిన ఓ మహిళా పోలీస్ కళ్లు తిరిగి కింద పడిపోయారు. గత రెండు, మూడు రోజులుగా కౌన్సెలింగ్ కారణంగా నిద్ర లేకపోవడం, తీవ్ర ఒత్తిడికి గురికావడంతో అస్వస్థతతో కిందపడిపోయారు. అక్కడే ఉన్న పలువురు మహిళా సంరక్షణ కార్యదర్శులు ఆమెకు సపర్యలు చేసి, ఉపశమనం కలిగించారు. పోలీస్ శాఖ ఉన్నతాధికారులు తీరుపై బాధిత ఉద్యోగులు, సామాన్యులు సైతం ఇదెక్కడి బాసిజం అంటూ మండిపడ్డారు. వందలాది మంది మహిళా పోలీసులకు నాలుగు రోజుల పాటు కౌన్సెలింగ్ నిర్వహించి, గందరగోళం సృష్టించిన అధికారులు కనీసం వాళ్ల సమస్యలు వినేందుకు కూడా అనుమతించకపోవడంపై తీవ్ర విమర్శలు వినిపిస్తున్నాయి. అక్కడి పరిస్థితులను ఫొటోలు తీయడానికి వెళ్లిన మీడియా ఫొటో గ్రాఫర్లను సైతం అనుమతించలేదు. డీపీఓ ఫొటోలు తీసుకోవాలన్నా అనుమతులు తీసుకోవాలంటూ పోలీసులు హెచ్చరించడం బాసిజానికి పరాకాష్టగా నిలుస్తోందనే విమర్శలు వినిపిస్తున్నాయి.

చిత్రజ్యోతి
★ SINCE 1965 ★

రెండో షెడ్యూల్‌లో ఎన్సీ 24




నాగచైతన్య కథానాయకుడిగా కార్తీక్ దండు దర్శకత్వంలో ఓ చిత్రం (ఎన్సీ-24- వర్కింగ్ టైటిల్) తెరకెక్కుతోంది. బీవీఎస్ఎన్ ప్రసాద్, సుకుమార్ నిర్మిస్తున్నారు. ప్రస్తుతం చిత్రీకరణ జరుగుతోంది. శుక్రవారం హైదరాబాద్‌లో రెండో షెడ్యూల్‌ను ప్రారంభించినట్లు యూనిట్ తెలిపింది. నెలరోజుల పాటు సాగే ఈ షెడ్యూల్‌లో నాగచైతన్యతో పాటు ప్రధాన తారాగణం అంతా పాల్గొంటోంది. ఈ సందర్భంగా యూనిట్ నాగచైతన్య పోస్టర్‌ను విడుదల చేసింది. ఒక చేతిలో గొడ్డలి, మరో చేతిలో తాడుతో మాస్ లుక్‌లో నాగచైతన్య ఆకట్టుకున్నారు. ఈ చిత్రానికి అజనీష్ బి లోక్‌నాథ్ సంగీతం అందిస్తున్నారు. సినిమాటోగ్రఫీ: రఘుల్ ధరుమాన్

వైరల్ వయ్యారి



గాలి జనార్దన్ రెడ్డి తనయుడు కిరీటి రెడ్డి కథానాయకుడిగా పరిచయమవుతున్న యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్ 'జూనియర్'. రాధాకృష్ణ దర్శకత్వంలో వారాహి చలనచిత్రం బేనర్‌పై రజనీ కొర్రపాటి నిర్మించారు. శ్రీలీల కథానాయిక. ఈ నెల 18న ఈ చిత్రం విడుదలవుతోంది. చిత్ర బృందం ప్రచార కార్యక్రమాల్లో వేగం పెంచింది. 'జూనియర్' నుంచి రెండో పాటను యూనిట్ శుక్రవారం విడుదల చేసింది. 'వైరల్ వయ్యారి' అంటూ సాగే ఈ గీతానికి కల్యాణ్ చక్రవర్తి సాహిత్యం అందించారు. దేవి శ్రీ ప్రసాద్ స్వరాలందించడంతో పాటు హరిప్రియతో కలసి ఆలపించారు. దేవి సంగీతంతో పాటు కిరీటి రెడ్డి, శ్రీలీల స్టెప్పులు ఈ పాటకు ప్రత్యేకాకర్షణగా నిలిచాయి. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: కె. కె. సెంథిల్ కుమార్

పల్లెటూరి సరదాలు



మనోజ్ చంద్ర, మోనిక టి, ఉషా బోనెల ప్రధాన పాత్రల్లో తెరకెక్కుతోన్న గ్రామీణ నేపథ్య వినోదాత్మక చిత్రం 'కొత్తపల్లిలో ఒకప్పుడు'. నటి, నిర్మాత ప్రవీణ పరుచూరి ఈ సినిమాతో దర్శకురాలిగా పరిచయం అవుతున్నారు. రానా దగ్గుబాటి సమర్పణలో గోపాల కృష్ణ పరుచూరి, ప్రవీణ పరుచూరి నిర్మిస్తున్నారు. ఈనెల 18న థియేటర్లలో విడుదలవుతోంది. ఈ సందర్భంగా మేకర్స్ ఈ చిత్ర టీజర్‌ని విడుదల చేశారు. మనోజ్ చంద్ర రికార్డ్ డ్యాన్స్ స్టూడియోని నడుపుతున్న యువకుడిగా కనిపించాడు. పల్లెటూరి జీవితాన్ని, సరదాలని అద్భుతంగా ఈ చిత్రంలో చూపించబోతున్నామని చిత్రబృందం పేర్కొంది.

జెన్కో జోరు.. రికార్డు స్థాయిలో విద్యుదుత్పత్తి

- మార్కెట్లో కొనకుండానే కరెంటు సరఫరా
- అందుబాటులోకి శ్రీశైలం జలవిద్యుత్
- మొత్తం 199.498 మిలియన్ యూనిట్ల ఉత్పత్తి
- డిమాండ్‌కు సరిపడా అందడంతో.. బయట కొనుగోలు చేయని డిస్కంలు

అమరావతి, జూలై 4 (ఆంధ్రజ్యోతి): బహిరంగ మార్కెట్లో విద్యుత్ కొనుగోళ్లకు వెళ్లకుండానే.. డిమాండ్‌కు సరిపడా కరెంటును ఏపీ జెన్‌కో ఉత్పత్తి చేస్తోంది. శుక్రవారం రికార్డు స్థాయిలో విద్యుత్ ఉత్పత్తి చేసింది. రాష్ట్ర విద్యుదుత్పత్తి సంస్థలు అందించిన సమాచారం మేరకు.. శుక్రవారం 199.498 మిలియన్ యూనిట్లను అవి ఉత్పత్తి చేశాయి. దీంతో.. మార్కెట్లో ఒక్క యూనిట్‌ను కూడా కొనుగోలు చేయకుండా డిస్కంలు డిమాండ్‌ను తట్టుకున్నాయి. శుక్రవారం ఏపీ జెన్కో ఆధ్వర్యంలోని థర్మల్ విద్యుత్కేంద్రాల్లో 78.015 మిలియన్ యూనిట్లు, జలవిద్యుత్కేంద్రాల్లో 19.869 మిలియన్ యూనిట్లు, జెన్కో సోలార్ కేంద్రాల్లో 1.588 మిలియన్ యూనిట్లు, సెంట్రల్ జనరేటింగ్ స్టేషన్లు 10.938 మిలియన్ యూనిట్లు, ఐపీపీ (సెయిల్, హెచ్ఎన్‌పీసీఎల్) 37.945 మిలియన్ యూనిట్లు, పవన విద్యుత్ 57.946 మిలియన్ యూనిట్లు, ప్రైవేటు సోలార్ 18.383 మిలియన్ యూనిట్లు, అంతర్రాష్ట్ర ఉత్పత్తి 1.206 మిలియన్ యూనిట్లు.. మొత్తం 199.498 మిలియన్ యూనిట్లను విద్యుత్ సంస్థలు అందించాయి. డిమాండ్ కూడా అంతే ఉండడంతో డిస్కంలు మార్కెట్లో కొనుగోలు చేయలేదు. శ్రీశైలం కుడిగట్టు జలవిద్యుత్కేంద్రంలో ఉత్పత్తి కొనసాగుతోంది. 720 మెగావాట్లు అందుబాటులోకి వచ్చింది. కృష్ణపట్నం థర్మల్ మూడో యూనిట్ నుంచి 750 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి అయింది. వీటితో కలిపి 199.498 మిలియన్ యూనిట్ల ఉత్పత్తి జరిగింది. ఇంకోవైపు.. థర్మల్ విద్యుదుత్పత్తి బాగానే ఉన్నందున ప్లాంట్లలో బొగ్గు నిల్వలను ఇంకా పెంచాలని విద్యుత్ రంగ నిపుణులు చెబుతున్నారు. వీటీపీఎస్‌లో రోజుకు 41,500 మెట్రిక్ టన్నుల బొగ్గు అవసరం కాగా.. 13 రోజులకు సరిపడా 5,48,586 టన్నుల బొగ్గు నిల్వలు ఉన్నాయి. ఆర్‌టీపీపీలో రోజుకు 28,500 టన్నులు అవసరం కాగా.. రెండున్నర రోజులకు సరిపడా 74,549 టన్నుల నిల్వలే ఉన్నాయి. కృష్ణపట్నం థర్మల్ ప్లాంట్‌లో రోజుకు 29,000 టన్నుల బొగ్గు అవసరం కాగా.. భారీగా 2,30,020 టన్నుల నిల్వలు ఉన్నాయి. సెయిల్‌లో రోజుకు 20,000 మెట్రిక్ టన్నుల బొగ్గుకు గాను 4,72,705 టన్నుల నిల్వలు ఉన్నాయి.

బకాయిలతో డిస్కంలు విలవిల..

రూ.7,562.48 కోట్ల బకాయిలు రాష్ట్ర డిస్కంలను భయపెడుతున్నాయి. నెలలోపే విద్యుత్ బకాయిలను తీర్చాలన్న నిబంధనలను దాటిన మొత్తాలు రూ.3,513.34 కోట్లు ఉన్నాయి. ఈ నెలలో చెల్లించాల్సిన బకాయిలు రూ.4,049.14 కోట్లు. ఈ మొత్తాలను తీర్చడానికి నిధుల కోసం డిస్కంలు అన్వేషణ ప్రారంభించాయి. అప్పులు తీర్చడానికి కొత్త అప్పులు చేయడానికి సిద్ధమవుతున్నాయి.

ఇక 'స్మార్ట్' రేషన్ కార్డులు

- ఏటీఎం కార్డుల్లా రూపకల్పన
- క్యూఆర్ కోడ్‌తో వివరాలు ప్రత్యక్షం
- పాత కార్డుల స్థానంలో కొత్త కార్డులు
- నేతల ఫొటోలు లేకుండా ముద్రణ
- ప్రభుత్వ అధికారిక చిహ్నం, లబ్ధిదారు ఫొటో ఉండేలా చర్యలు
- సిద్ధమవుతున్న కొత్త స్మార్ట్ కార్డులు
- వచ్చే నెలలో పంపిణీకి ఏర్పాట్లు



అమరావతి, జూలై 4(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రేషన్ కార్డుల రూపుమారుతోంది. అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో తయారవుతున్నాయి. గత వైసీపీ ప్రభుత్వం కార్డులకు పార్టీ రంగులు పులిమేసి.. వాటిపై ఒకవైపు జగన్ బొమ్మ, మరోవైపు వైఎస్ రాజశేఖరరెడ్డి బొమ్మను ముద్రించి పంపిణీ చేసింది. ఇప్పుడు వాటికి స్వస్తి చెప్పి.. రాజకీయ పార్టీల రంగులు లేకుండా, నేతల బొమ్మలు ముద్రించకుండా కొత్త కార్డులను రూపొందిస్తున్నారు. పాత వాటి స్థానంలో ఈ కొత్త కార్డులు జారీ చేయడంతో పాటు ఇకపై కొత్తగా మంజూరు చేసే కార్డులన్నీ కూడా స్మార్ట్ కార్డులుగానే ఉండనున్నాయి. బ్యాంకు ఏటీఎం కార్డు తరహాలో క్యూఆర్ కోడ్‌తో ఈ స్మార్ట్ రేషన్ కార్డును రూపొందిస్తున్నారు. ఈ కార్డుల జారీకి పౌరసరఫరాల శాఖ ఇప్పటికే కసరత్తును పూర్తి చేసింది. స్మార్ట్ రేషన్ కార్డుపై ఒకవైపు రాష్ట్ర ప్రభుత్వ అధికారిక చిహ్నం, మరోవైపు కార్డుదారు (కుటుంబ పెద్ద) ఫొటో ఉంటాయి. ఆ రేషన్ కార్డు నంబరు, రేషన్‌షాపు నంబరు తదితర వివరాలుంటాయి. కార్డు వెనుకవైపు లబ్ధిదారు కుటుంబ సభ్యుల వివరాలుంటాయి. ఈ స్మార్ట్ రేషన్ కార్డును రేషన్ డీలర్ల వద్ద ఉండే ఈ-పోస్ యంత్రాల సహాయంతో స్కాన్ చేస్తే ఆ కుటుంబానికి సంబంధించిన వివరాలతో పాటు రేషన్ సరుకుల వినియోగానికి సంబంధించిన పూర్తి సమాచారం ప్రత్యక్షమవుతుంది. అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందించే ఈ కొత్త స్మార్ట్ రేషన్ కార్డుల ముద్రణ కోసం ఏపీటీఎస్ ద్వారా టెండరు ప్రక్రియ పూర్తి చేశారు. ప్రస్తుతం ముద్రణ దశలో ఉన్న కొత్త స్మార్ట్ రేషన్ కార్డులను వచ్చే నెలలో పంపిణీ చేసేందుకు పౌరసరఫరాలశాఖ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

2 లక్షల కుటుంబాలకు కొత్తగా లబ్ధి

రాష్ట్రవ్యాప్తంగా ప్రస్తుతం 1.46 కోట్లకుపైగా కుటుంబాలకు రేషన్ కార్డులు ఉన్నాయి. వైసీపీ హయాంలో అర్హతలున్న నవదంపతులు, పేదలు రేషన్ కార్డుల కోసం దరఖాస్తులు చేసుకున్నా అప్పటి ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో లక్షల సంఖ్యలో దరఖాస్తులు మూలనపడి ఉన్నాయి. అధికారంలోకి వచ్చాక కూటమి ప్రభుత్వం.. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ ప్రకారం రాష్ట్రంలో అర్హులైనవారందరికీ కొత్త రేషన్ కార్డులను మంజూరు చేసింది. దీంతోపాటు తల్లిదండ్రుల నుంచి వేరుపడిన వారికి స్ప్లిట్ కార్డులు, ఉన్న రేషన్ కార్డులలో సభ్యుల చేర్పులు, తొలగింపులు, చిరునామాల మార్పులకు అవకాశం కల్పిస్తూ గత మే నెలలో దరఖాస్తులను స్వీకరించిన సంగతి తెలిసిందే. దీంతో ప్రతి జిల్లా నుంచి లక్షలాదిగా వచ్చిపడిన దరఖాస్తుల పరిశీలన ప్రక్రియను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేశారు. రాష్ట్రవ్యాప్తంగా కొత్త రేషన్ కార్డుల కోసం 1,47,187 మంది దరఖాస్తులు చేసుకోగా.. వారిలో 89,864 మందికి కొత్త కార్డులు మంజూరు చేశారు. 38,046 మంది దరఖాస్తులను వివిధ కారణాలతో తిరస్కరించారు. కుటుంబ విభజన (స్ప్లిట్) కార్డుల కోసం 1,43,745 మంది దరఖాస్తు చేసుకోగా.. వారిలో 1,09,787 మందికి కొత్త కార్డులు మంజూరు చేశారు. 20,403 దరఖాస్తులను తిరస్కరించారు. ఇలా కొత్తగా మంజూరు చేసిన దాదాపు 2 లక్షల కొత్త రేషన్ కార్డులలోని లబ్ధిదారులకు సెప్టెంబరు నెల నుంచి రేషన్ సరుకులు పంపిణీ చేసే అవకాశం ఉంది. కొత్తగా వచ్చిన కార్డులతో రాష్ట్రంలో మొత్తం రేషన్ కార్డుల సంఖ్య 1.48 కోట్లకు చేరింది.